నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
మహబూబ్‌నగర్
మంగళవారం | నవంబర్ 05. 2024 | www.navatelangana.com

సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలి

- 2253 ఎన్యూ మరేషన్ బ్లాక్ లు, 1880
- మంది ఎన్యూమరెటర్లు
- కలెక్టర్ విజయేందిర బోయి



నవ తెలంగాణ -మహబూబ్ నగర్

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (సామాజిక,ఆర్థిక,విద్యా,రాజకీయ,కుల సర్వే) నిర్వహించటానికి జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ప్రజలందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు.సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరం లో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశం లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే గురించి వివరించారు. ఈ నెల 6 నుండి ఇంటింటికీ ఎన్యూమ రేటర్ లు వెళ్లి మొదటి దశలో ఇండ్ల జాబితా తయారు చేస్తారని తెలిపారు.ఇండ్ల జాబితా తయారీ లో ఇంటి అడ్రస్,కుటుంబ యజమాని పేరు వివరాలు సేకరిస్తారని తెలిపారు. ప్రతి ఇంటికి స్టికర్ అంటిస్తారని తెలిపారు. సర్వే నిర్వహణకు జిల్లాలో 2253 ఎన్యుమారేషన్ బ్లాక్ లుగా ఏర్పాటు చేసినట్లు సరాసరి,150 ఇండ్లను ఒక బ్లాక్ గా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.150 నుంచి 175 వరకు ఇండ్లను ఒక బ్లాక్ గా తీసుకోవడం జరిగిందని తెలిపారు.జిల్లాలో సర్వే నిర్వహణకు జిల్లాలో 1880 మంది ఎన్యూమరేటర్ లను నియమించినట్లు కలెక్టర్ వెల్లడించారు.ఒక్కొక్క బ్లాక్ కు ఒక ఎన్యూమరేటర్ ,పది బ్లాక్ లకు ఒక సూపర్ వైజర్ చొప్పున నియమించి నట్లు తెలిపారు. ఎన్యూమరేటర్ లుగా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్ వాడి టీచర్ లు,పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ,వివిధ శాఖల సిబ్బందిని నియమించినట్లు తెలిపారు.నవంబర్ 4,5 తేదీల్లో ఎన్యూమరేటర్ లకు మండలం ,మున్సిపాలిటీలలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు,సర్వే నిర్వహణపై అవగాహన కలిగిస్తున్నట్లు తెలిపారు.ఇండ్ల జాబితా తయారీ తర్వాత పూర్తి వివరాలతో 75 అంశాల్లో వివరాలు సేకరిస్తారని తెలిపారు.ఈ సర్వే ను 10 నుండి 15 రోజుల్లో పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు.సర్వే కు వచ్చినప్పుడు ఇంటి యజమాని కుటుంబ సభ్యులు ఆధార్ కార్డు,రేషన్ కార్డ్ వివరాలు దగ్గర సిద్ధంగా ఉంచుకోవాలని,సర్వే సిబ్బందికి తగిన సమాచారం అందించి సహకరించాలని తెలిపారు.సర్వే ఆధారంగా భవిష్యత్తులో ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలకు ఉపయోగ పడుతుందని అన్నారు.సర్వే సమాచారం సేకరించి పోర్టల్ లో డేటా ఎంట్రీ చేయడం జరుగుతుందని అన్నారు.సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై ప్రజా ప్రతినిధులు,మీడియా విస్తృతంగా ప్రజలకు అవగాహన కలిగించాలని అన్నారు. ఈ పత్రికా విలేకరుల సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,డీపీఆర్.ఓ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రోడ్లపై ధాన్యాన్ని పోసి ప్రజల మరణానికి కారణం కావొద్దు: ఎస్పీ

నవతెలంగాణ -మహబూబ్ నగర్



రోడ్లపై ధాన్యం పోసి ప్రజల మరణాలకు కారణం కావద్దని జిల్లా ఎస్పీ టీ జానకి సోమవారం ఒక ప్రకటనలో రైతులకు విజ్ఞప్తి చేశారు.వాహనదారులు మోటార్ సైకిల్ రాత్రి సమయాలలో అది గమనించక ప్రమాదం జరిగి చనిపోవు చున్నారు.బావి దగ్గర ఇండ్ల వద్ద లేదా వరి కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం పోయడానికి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.రోడ్లపై ధాన్యం పోయవద్దని పోలీస్ అధికారులు సిబ్బంది కూడా రైతులకు అవగాహన కల్పించాలన్నారు.ఎవరైనా ధాన్యాన్ని రోడ్లపై నిర్లక్ష్యంగా పోస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

విద్యార్థులకు బ్యాగులు,నోటు పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ నవాబ్ పేట

మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాల గుబ్బడి గుచ్చ తాండలో పాఠశాల విద్యార్థులకు ఆశ జ్యోతి ఫౌండేషన్ వారి సహకారంతో విద్యార్థులకు బ్యాగులు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా లింగంపల్లి కాంప్లెక్స్ ఎఫ్ఏసి ప్రధానోపాధ్యాయులు సల్వాచారి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను చేరాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూపతి సింగ్, విద్యార్థులు ఉన్నారు.

మొక్కుబడిగా 'ప్రజావాణి'

- ఒకే ఒక దరఖాస్తు అందజేత



నవతెలంగాణ - బాలానగర్.

ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రజా వాణి కార్యక్రమం నిర్వహిస్తున్నప్పటికీ దరఖా స్తులు మాత్రం రావడం లేదు. ప్రతి ప్రజావాణి కార్యక్రమంలో ఒకటి రెండు దరఖాస్తులు మాత్రమే వస్తున్నాయి సోమవారం మండల ప్రజా పరిషత్ నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బాలానగర్ మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలించడంతో దుమ్ము ధూళికి తట్టుకోలేకపోతున్నామని మూడు గ్రామాలకు చెందిన రైతులు ఫిర్యాదు చేశారు. సమస్య పరిష్కార కాకపోతే ప్రభుత్వ కార్యాలయాల ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు.ఫాస్టింగ్రు బోరు బావులు ఫిర్యాదులో పేర్కొ న్నారు. దీనికి సంబంధించిన కాకితాలను జిల్లా కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ మిడ్జిల్

మండలంలోని వల్లపు రావు పల్లి, బైరంపల్లి, కంచనపల్లి, మసిగుండ్ల పల్లి గ్రామాలల్లో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం కొనుగోలు కేంద్రాలను జడ్చర్ల మార్కెట్ కమిటీ జ్యోతి అల్వాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులకు అందుబాటులోనే కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభిస్తుందని రైతులందరూ కూడా వడ్లను కొనుగోలు కేంద్రాల లోనే ప్రభుత్వం ఇస్తున్న ధరకు అమ్ముకోవాలని సూచించారు. అనంతరం అన్ని గ్రామాలలో మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి అల్వాల్ రెడ్డి మహిళా సమాఖ్య సభ్యులు, కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మిడ్జిల్ మాజీ ఎంపీటీసీ సభ్యులు మహమ్మద్ గౌస్, నరసింహ, వెంకట శివప్రసాద్, మార్కెట్ డైరెక్టర్, బంగారు, సత్యం గౌడ్, కాంగ్రెస్ పార్టీ యూత్ మండల అధ్యక్షులు కృష్ణ యాదవ్, నాయకులు వెంకటేష్ గౌడ్, శ్రీధర్, శ్రీశైలం, మహిళా సమాఖ్య సభ్యులు,సీసీ ప్రకాష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు చలో హైదరాబాద్

నవ తెలంగాణ- మహబూబ్ నగర్

రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆటో కార్మికులకు ఇచ్చిన 12 వేల రూపాయల సాధనకై మంగళవారం చలో హైదరాబాద్ నిర్వహి స్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు పి సురేష్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆటో అడ్డల దగ్గర విస్తృత ప్రచారం నిర్వహి ంచారు.ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ మోటారు రంగ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు శ్రీరామ్, గోవర్ధన్, యాదయ్య హజీమ్,ప్రవీణ్,హరీష్,భాస్కర్,సూరి, అంజి,శ్రీనివాస్, తిరుమలేష్, భీమయ్య పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి అభిమాన్యు రెడ్డి ప్రత్యేక పూజ

నవతెలంగాణ రాజాపూర్



రాజాపూర్ మండల్ తీర్మాలపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఆలయం సందర్భంగా శ్రీ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతన ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. యువనేత శ్రీ చించోడ్ అభిమన్యు రెడ్డి, మాజీ సర్పంచ్లు, మాజీ ఉప సర్పంచులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సామాజిక ఆర్థిక రాజకీయ కులం సర్వేపై శిక్షణ తరగతులు

నవతెలంగాణ -నవాబ్‌పేట



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక ఆర్థిక కులం రాజకీయ సర్వేపై మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో జయరాం నాయక్ అధ్యక్షతన ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి శంకరా చారి హాజరై శిక్షణ సంబం ధించిన వివరాలను తెలిపారు.సామాజిక సర్వే పకడ్బందీగా నిర్వహి ంచేందుకు అన్ని విధాలా కృషి చేయాలని సూచించారు. ఈ శిక్షణ తీసుకున్న ఉద్యోగులు సర్వే పకడ్బందీగా నిర్వహి ంచాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివా సులు సర్వే శిక్షకులు శ్రీనివాస్ ఎంపీఓ బద్రు నాయక్ డిప్యూటీ ఎంఆర్వో గాయత్రి ఏపీఎం జీవరత్నం ఏపీఓ జ్యోతి సూపరి ంటెండెంట్ గోవింద రెడ్డి గాయత్రి గిర్దావారు కిరణ్ కుమార్ ప్రవీణ్ కుమార్ ఐసీడీఎస్ సూపర్వైజర్ లు రాజరాజేశ్వరీ రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

చతికిల పడ్డా బీఆర్ఎస్





- కొలుకొని బీజేపీ
- ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్
- అవస్థలో బీఎస్పీ

నవతెలంగాణ
మహబూబ్ నగర్ ప్రాంతీయ ప్రతినిధి

రాజకీయ పార్టీలు నేలను విడిచి సాము చేస్తున్నాయి. శాసనసభ పార్లమెంటు ఎన్నికలు ఏడాది ఉండగానే చోట బోటా నాయకులు ప్రజా సమస్యలను తీర్చడానికి తమ పార్టీ ముందు వరుసలో ఉంటుందని నమ్మబలికారు. నిత్యం ఏదో ఒక సమస్యను తీసుకొని ప్రజలతో కలిసి పని చేశారు. ప్రజలు ఎక్కడ ఉంటే అక్కడ నాయకులు వచ్చి వారి సమస్యలు అడిగి తెలుసుకునేవారు. రైతులు పొలంలో ఉన్న కార్మికులు కంపెనీలో ఉన్న యువత ఉపాధిలో ఉన్న పని ప్రదేశాలకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకునేవారు. ఎన్నికలు పూర్తి అయ్యాక ప్రజలను కనీసం పలకరించడం లేదు. పది సంవత్సరాలు అధికారంలో ఉండి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామని చెబుతున్న టిఆర్ఎస్ నేడు రాజకీయాలలో చతికిల పడింది. రైతు బీమా రైతుబంధు లక్ష రూపాయల రుణమాఫీ పింఛన్ల వంటి పథకాలు ఏవీ ఆ పార్టీని కాపాడుకోలేకపోయాయి. ఎన్నికలలో ఓడిపోయిన తర్వాత ప్రజల సానుభూతి పొందాల్సిన బీఆర్ఎస్ మరింత దూరమైంది. అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పిదాలను కప్పి పుచ్చుకోవడానికే పేపర్ ప్రకటనలు ఇస్తున్నారు. ప్రజల సమస్యలను ఏవి పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలలో కొన్ని పాక్షికంగా అమలు కావడం లేదని పలువురు తెలిపారు.ఇప్పటికీ బీఆర్ఎస్ ప్రజలకు దూరంగానే ఉందని చెప్పావచ్చును.

> శాసనసభ ఎన్నికలలో గట్టిగా పోటీ ఇచ్చిన బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల్లో. పత్తా లేకుండా పోయింది.ఎమ్మెల్యే ఎన్నికల్లో అలంపూర్ గద్వాల నియోజకవర్గాలలో గెలిచిన బీఆర్ఎస్ పార్లమెంటు ఎన్నికల్లో 3వ స్థానానికి పడిపోయింది. అప్పటినుంచి ఇప్పటిదాకా ప్రజా సమస్యలపై ప్రకటనలు తప్ప క్షేత్రస్థాయి ఉద్యమాలు చేయడం లేదు.బీజేపీకి మాత్రం ఎన్నికల తర్వాత ప్రజా సమస్యల పట్ల అవగాహన లేకుండా పోయింది. మండల జిల్లా స్థాయి అధ్యక్ష కార్యదర్శులను సైతం నియమించుకోలేకపోయింది. శాసనసభ పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ కులాల ను విస్మ రించి నందు వల్లే జిల్లాలో ఆ పార్టీ నామరూపాలు లేకుండా పోయిందన్న విమర్శలు వస్తున్నాయి.. గ్రామాలల్లో మండలాలలో కేంద్ర,రాష్ట్ర నాయకులు ఇచ్చిన పిలుపులను సైతం అమలు చేయడం లేదు. ఇక బీఎస్పీకి మాస్ ఇమేజ్ ఉన్న నాయకత్వ కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ఉద్యమాలే పునాదిగా పనిచేసే కమ్యూనిస్టులు నిత్యం పోరాటాలు చేస్తూ ప్రజల మధ్య ఉంటున్నారు.



బీజేపీ పరిస్థితి మాత్రం మరింత దయనీయంగా మారింది.ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తామని ప్రగల్భాలాలు పలికిన బీజేపీ నేడు చతికిల పడింది. కేంద్రంలో అధికారంలో ఉండి రాష్ట్రంలో అధికారంలోకి వస్తామన్న బీజేపీ నేడు మూడో స్థానానికి పరిమితమైంది. బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉండి ఈ రాష్ట్రానికి ప్రత్యేకంగా చేసింది ఏమీ లేదన్న విమర్శలున్నాయి. ఇన్ని సంవత్సరాల కాలంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులను సైతం నియమించుకోలేని పరిస్థితుల్లో బీజేపీ ఉంది. ఆత్మరక్షణలో పడిన బీజేపీ ప్రజా సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందన్న అపవాదు మూటకట్టుకున్నది. బీఎస్పీ పరిస్థితి పరీత దయనీయంగా ఉంది. శాసనసభ పార్ల మెంట్ ఎన్నికలలో నామమాత్రపు కోటి సైతం ఇవ్వలేక పోయింది. డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చెన్నూరు అసెంబ్లీ నుండి పోటీ చేసి ఓడిపోయిన తర్వాత బీఎస్పీ పట్ల యువత విముఖత వ్యక్తం చేస్తున్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఉంటే వచ్చే ఎన్నికలలో అయినా డీఎస్పీ గట్టి పోటీ ఇవ్వడమే గాక అధికారం సైతం చేపట్టే అవకాశాలు ఉండేవి. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బీఎస్పీని వీడి బీఆం ఎస్‌లో చేయడంతో ఆ పార్టీపై నీలి నీడలు కమ్ముకున్నాయి.

ఉద్యమ బాటలో కమ్యూనిస్టులు

జిల్లాలో గెలిచినా ఓడినా కమ్యూనిస్టులు మాత్రం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందున్నారు.దేశంలో ఆర్థిక అసమానతలు తొలగించే లక్ష్యంగా ఉద్యమాలు చేస్తున్నారు. భూమికోసం భుక్తి కోసం జరుగుతున్న పోరాటాలలో వీరి పాత్ర గణనీయం. రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిస్టులు గ్రామ శాఖ మొదలుకొని జిల్లా రాష్ట్ర మహాసభల ఏర్పాటులో నిమగ్నమై ఉన్నారు.

సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను జయప్రదం చేయండి


గండీడ్‌లో..

నవ తెలంగాణ -మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

జడ్చర్ల పట్టణంలో ఈనెల 8, 9 వ తేదీలలో జరుగు భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ మహబూబ్ నగర్ జిల్లా 20వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కడియాల మోహన్ కోరారు. సోమ వారం చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామంలోని కురుమూర్తి జాతర ప్రాంగణంలో జిల్లా మహాసభల గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను ఈ సంవత్సరం జడ్చర్ల పట్టణంలో నిర్వహించ నున్నట్టు తెలిపారు.ఈ జిల్లా మహాసభలకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్య దర్శివర్గ సభ్యులు ,మాజీఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ, టీ సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ వెంకట్రాములు, జిల్లా కార్యదర్శి ఎ రాములు హాజరవుతారని అన్నారు ఈ మహాసభలకు కార్మికులు కర్షకులు ,కూలీలు, మేధావులు, విద్యార్థి, యువజనులు ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా నాయకులు హన్మంతు,మండలనాయకులుదయ్యాలకురుమూర్తి,జనార్దన్,మైబు, పాల్గొన్నారు.

గండీడ్ :జడ్చర్ల పట్టణంలో నవంబర్ 8,9 తేదీల్లో జరగనున్న సీపీఐ(ఎం)20వ మహాసభలను విజయవంతం చేయాలని మండల నాయకులు మహేందర్ పిలుపునిచ్చారు.ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఎం.రాములు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు, ప్రజలకు ఏవిధంగా ఉపయోగపడతాయన్నారు.వాటి ఫలితాలు, సీపీఐ(ఎం) చేసిన కృషిని మహాసభల్లో చర్చించునట్లు తెలిపారు.రెండు రోజులపాటు మహాసభలో నిర్వహిస్తారన్నారు.ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయ వంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో వెంకటయ్య, బుచ్చయ్య, గాజుల వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమ్మేళనానికి అందరూ భాగస్వాములు కావాలి

నవతెలంగాణ-రాజాపూర్



తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 5,6 తేదీలలో ఖమ్మం పట్టణంలో జరిగే గిరిజన శిక్షణా తరగతులను మహబూబ్ నగర్ జిల్లా కమిటీ తరపున అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు భీమ్లానాయక్ ప్రధాన కార్యదర్శి చందర్ నాయక్ పిలుపునిచ్చారు.

క్రషర్ మిషన్ పై కోర్టు కేసు కొట్టి వేయలేదు

- మాజీ ఉపసర్పంచ్ భర్త ఆంజనేయులు



నవతెలంగాణ- నవాబ్ పేట

మండల పరిధిలోని చౌడూర్ గ్రామ సమీపంలో ఉన్న క్రషర్ మిషన్ సంబంధించిన కేసులో ఇంకా కొట్టి వేయలేదని ఇంకా కేసు విచారణ జరుగుతున్న విషయంపై చౌడూర్ గ్రామ మాజీ ఉప సర్పంచ్ భర్త ఆంజ నేయులు నవతెలంగాణ విలేకరికి పోన్ ద్వారా చేప్పారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టులో కేసు విచారణ జరుగుతున్న కూడా క్రషర్ మిషన్ పనులు పూర్తి చేసిన తర్వాత కంకరరాళ్ళు తయారు చేసి వారి వ్యాపా రం చేస్తున్నారన్నారు.ఆ కేసు సంబంధించిన వివరాలను అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని ఆరా తీస్తే బాగుంటుందని సూచించారు.అధికారులు సంప్ర దించి పూర్వాపరాలు తెలుసుకోవాలని ఆయన కోరారు.

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు భూ నిర్వాసితులకు ఆర్,ఆర్ ప్యాకేజీని అమలు చేయాలి: సీపీఐ(ఎం)







నవతెలంగాణ -జడ్చర్ల

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు భూ నిర్వాసితులకు ఆర్,ఆర్ ప్యాకేజీని అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రాములు అన్నారు. నవంబర్ 8 9 న జడ్చర్ల పట్టణంలో జరగ నున్నాయి మహాసభలను జయప్రదం చేయాలని నియోజకవర్గం లోని మండలాల్లో సీపీఐ(ఎం) జడ్చర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో జడ్చర్ల మండలం ఉదండాపూర్‌లో జీపు జాత కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డి రిజర్వాయర్ కింద నిర్వాసితులైన రైతులు, వ్యవసాయ కూలీలు, చిన్న సన్న కారు రైతులు, నిరుద్యోగులు, యువకులు మధ్యతరగతి ప్రజలు, దళితులుసర్వం కోల్పోయినేడు ప్రభుత్వం తరపున ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కాబట్టి నిర్వాసితులకు ఆర్,ఆర్ ప్యాకేజీని అమలు చేసి, 25 లక్షల పరిహారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. నవంబర్ 8 9న జడ్చర్ల పట్టణంలో జరిగే సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.అనంతరం సీపీఐ(ఎం) జిల్లా నాయకులు దీప్లా నాయక్, జగన్ మాట్లాడుతూ రాబోవు మూడు సంవత్సరాల కాలంలో ప్రజా సమస్యల పైన సీపీఐ(ఎం) ఆధ్వర్య ంలో ఉద్యమ కార్యచరణ చేపడతామన్నారు.జిల్లా మహాసభలను రైతులు కార్మికులు,,వ్యవసాయ కూలీలు,,దళితులు, విద్యార్థులు నిరుద్యోగులు, ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ (ఎం) మండల నాయకులు సత్తయ్య, యాదయ్య, నాగరాజు, శ్యాంసుందర్, ఉదండాపూర్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

మిడ్జిల్ :కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు 6 గ్యారంటీలు అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు, జగన్, తెలుగు సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నవంబర్ 8 9 తేదీలలో జడ్చర్లలో సీపీఐ(ఎం) జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని సోమవారం జీపు యాత్రలో భాగంగా మండల కేంద్రంలో నిర్వహి ంచారు. పాలమూరు ఎత్తిపోతల పథకం లో భాగంగా ఉదండాపూర్, కరివేనా రిజర్వాయర్లు నిర్మాణం పరిశ్రమలో పని చేసే వివిధ రాష్ట్ర కార్మికుల్ల జడ్చర్ల మినీ ఇండియా గా రూపు దిద్దుకుంటున్న దని తెలిపారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగాసీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ.రాములు, ప్రధానోపాన్యాసకులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాన్ వెస్లీ, సాగర్, జయలక్ష్మి ,వెంకట రాములు ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్ర మంలో సీపీఐ(ఎం)నాయకులు శ్యాంసుందర్, శంకర్, యాదయ్య, ఆంజనేయులు, షబ్బీర్ పాల్గొన్నారు.

మండలాల్లో గ్రామాల్లో ప్రచారం.

బాలానగర్ : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గంలో ఈనెల 8. 9 తేదీలలో జరగ బోయే సభను విజయవంతం చేయాలని సీపీ ఐ(ఎం) నాయకులు దీప్లా నాయక్. టి జగన్ తెలిపారునాయకులు సోమవారం రాజాపూర్. బాలా నగర్ మండలాలలో పలు గ్రామాలలో ప్రచారం చేశారు. జడ్చర్ల కంచలింగం మానెమ్మ ఫంక్షనాల్లో జరగ బోయే మహాసభకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ.రాములు. జూలకంటి రంగారెడ్డి. జాన్ వెస్లీ. టీ సాగర్. టి విజయలక్ష్మి. వెంకట్ రాములు, కిల్లే గోపాల్. హాజరవుతున్నారని తెలిపారు

పాలమూరులో అరాచక పాలన

బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

నవ తెలంగాణ- మహబూబ్ నగర్



కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఏడాది లోపే పాల మూరులో అరాచక పాలన కొనసాగుతుందని బీఆర్ ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపి ంచారు. సోమవారం శ్రీనివాస్ గౌడ్ తో కలిసి జిల్లా జైల్లో ఉన్న శ్రీకాంత్ గౌడ్ పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. మహబూబ్ నగర్ ని పూర్తి స్థాయిలో అభివృధి చేసిన ఘనత శ్రీనివాస్ గౌడ్ కి దక్కుతుందని ఇప్పుడు రాజకీయంగా ఎదుర్కోలేని వారి కుటుంబంతో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులపైన తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని అన్నారు. 2018 లోని ముగ్గురు దొంగ పట్టాల సృష్టించాలని కేసులు నమోదు చేసిన అధికారులు బలవంతంగా శ్రీకాంత్ గౌడ్ ని ఆ కేసులో ఇరికించారని తెలిపారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న బీసీ నాయకులను రాష్ట్ర ముఖ్యమంత్రి టార్గెట్ చేసి వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వానికి శాత నైతే దివ్యాంగులకు పేదలకు ఇండ్లు కట్టించి ఇవ్వాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డికి తెలియకుండా ఇక్కడ ఏ కేసులు కావడం లేదని శ్రీనివాస్ గౌడ్ కుటుంబానికి ఏ హాని జరిగినా ఎమ్మెల్యేనే బాధ్యత వాయించాలని తెలిపారు.కార్యక్రమంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ లు శ్రీకాంత్ గౌడ్ ని పరామర్శించారు. కార్యక్రమం లో కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఆంజనేయులు, రాష్ట్ర నాయకులూ విజయకుమార్, శ్రీనివాస్ యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, హన్వాడ మాజీ ఎంపీపీ బాలరాజు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరిస్తాం



నవాబ్ పేట : ప్రజావాణి ఫిర్యా దులను వెంటనే పరిష్కరిస్తామని ఎంపీడీవో జయరాం నాయక్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాల యంలో ఎంపీడీవో జయరాం నాయక్ అధ్యక్షతన కొనసాగు తున్న ప్రజావాణి కార్యక్రమంలో ఒక పంచాయతీ రాజ్ సంబం ధించిన ఫిర్యాదును అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలకు ఏలాంటి సమస్యలు ఉన్నా మండల స్థాయిలో ప్రతి సోమవారం ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరిం చడానికి ఈ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిం దన్నారు. కావున తమ సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి మండల అధికారి అందుబాటులో ఉంచామని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ శ్రీనివాసులు ఎంపీఓ బద్రు నాయక్ ,వ్యవసాయ అధికారి కృష్ణ కిషోర్,సూపరింటెండెంట్ గోవింద రెడ్డి, ఏపీఎం జీవరత్నం, ఏపీఓజ్యోతి ఎంఆర్పీ జనార్ధన్ ,ఎక్సైజ్ అధికారులు ఇంజినీర్లులు షమీ ఉల్లాఖాన్,ఐసీడీఎస్ సూపర్వైజర్ అధికారులు పాల్గొన్నారు.

అమృత ధారలు



నవ తెలంగాణ మహబూబ్ నగర్

సాహితీవనంలో
విరబూసిన పరిమళాల గులాబి
తెలంగాణ మట్టిలో
మొలకెత్తిన క్రాంతి విత్తనం
మహావృక్షమై నలుదెసలా పరిఢవిల్లిన
పచ్చని పత్ర
హరిత తెలంగాణ మాగాణం
తరతరాల బూజు దులిపిన చైతన్య ఉద్గారం
నా తెలంగాణ కోటి రతనాల వీణ
నినదించి తెలంగాణ నిలువెల్లా ఆవహించిన ధిక్కారస్వరం
సాహితీ మథనంలో ప్రభవించిన
అగ్నికీలల విద్యుత్తు
బానిసత్వశృంఖలాల్ని భస్మంచేసిన దాశరథి విద్వత్తు
పసిపాపల నిదుర కన్నుల్లో జనించే ఉషస్సు
అన్నార్తులు అనాథలుండని
మానవాళిపై చిలకరించిన తేజస్సు
జైలు గోడల భయంకర ఒంటరి తపోదీక్షలు
నిద్రాణ మనస్కుల మేల్కొలిపే క్రాంతి రేఖలు
బ్రతుకు వీణపై మ్రోగిన సాహితీ సమ్మోహన రాగాలు
ప్రతి మదినీ పరవశింపజేసే మధుర గీతాల సుధలు
గుండెల్ని మండించే దాశరథి భావోత్పాతాలు
ఎందరెందరో్నో కదిలించి
కార్యోన్ముఖుల్ని చేసిన జీవన తత్వాలు
రాచరికం రావణకాష్టాల్ని దునుమాడిన
మీ కలం బలం
వేయి వెలుగులదివ్వెల్ని వెలిగించిన
మీగళంలోని సంరంభం
దాశరథి "తెలంగాణ" పూదోటలో విరిసిన రంగుల హరివిల్లులు
అస్తిత్వపునాదుల్ని పాతిన శాశ్వత ప్రమాణాలు
మానవుడే మహోన్నతుడన్న మీదివ్య సందేశం
కవిత్వ సాగరంలో దాశరథి కలం
కవ్వం చిలికిన అమృత ధారలు
భవిష్యత్ తరాలకొక మార్గనిర్దేశక మంత్రోపదేశం

(నవంబర్ 5 ,దాశరథి వర్ధంతి నేపథ్యం)

.లక్ష్మణ్ గౌడు
9704930509

నవతెలంగాణ 2
వనపర్తి
మంగళవారం నవంబర్ 5, 2024 www.navatelangana.com

పెండింగ్ వేతనాల కోసం అంగన్‌వాడీల ధర్నా



నవతెలంగాణ-వనపర్తి

ఐదారు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలంటూ సోమవారం తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఏవోకు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, వనపర్తి ప్రాజెక్టు అధ్యక్షుడు జి.జ్యోతి, యూనియన్ నాయకులు కవిత, అనిత, సరోజ, లక్ష్మి సుమిత్ర, కవిత, ఈజ్జా తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి : కలెక్టర్

నవతెలంగాణ- వనపర్తి

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, అర్జీలను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లుతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణికి 40 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను పరిశీలించి, సత్వర పరిష్కారం చూపేలా సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చిన, పెండింగ్ లో ఉన్న అర్జీలను సైతం వారంలో పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

- సీపీఎం మండల కార్యదర్శి బాల్ రెడ్డి



ఇంటింటి ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

నవతెలంగాణ-వీపనగండ్ల

సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ మండల కార్యదర్శి బాల్‌రెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం బొల్లారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సీపీఎం కార్యకర్తలు మండల పరిధిలోని సంగినేనిపల్లి, కొర్లకుంట గ్రామంలో ఇంటింటికి తిరిగి ఈనెల 10,11వ తేదీల్లో వీపనగండ్ల మండల కేంద్రంలో నిర్వహించనున్న జిల్లా మూడో మహాసభలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి బాల్‌రెడ్డి మాట్లాడుతూ మహాసభలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, సాగర్, జిల్లా కార్యదర్శి ఎండీ.జబ్బార్, సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి హాజరవుతారని తెలిపారు. మహాసభలకు మండలంలోని ప్రజలు, సానుభూతిపరులు, పార్టీ కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ సర్పంచ్ ఎం. కృష్ణయ్య, మండల నాయకులు, మాజీ సర్పంచ్ ఆర్.మౌలాలి, వి.కృష్ణయ్య నాయకులు రాముడు, ముత్యాలు, నాగరాజు, తిరుపతయ్య, రంగస్వామి ఆంజనేయులు గౌడ్, జంపన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా సర్వే చేయాలి

నవతెలంగాణ - వీపనగండ్ల



మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో సోమవారం మండల స్థాయి అధికారులకు సమగ్ర కుటుంబ సర్వేపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు, ట్రైనింగ్ అధికారులు మాట్లాడుతూ గ్రామాలలో నిర్వహించే సమగ్ర కుటుంబ సర్వే ఫారం ఏ విధంగా నింపాలి తదితర అంశాలపై వివరించారు. తప్పులు లేకుం డా సర్వే చేయాలని సూచించారు.

రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దు

- ఎస్సై కె.శేఖర్ రెడ్డి

నవతెలంగాణ-మదనాపురం



రోడ్లపై ధాన్యం ఆరబోసి ప్రమాదాలకు కారణ కావొద్దని ఎస్సై శేఖర్ రెడ్డి రైతులకు సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోడ్లపై ధాన్యం పోసి కవర్లు కప్పడం వల్ల రాత్రి వేళ కుప్పలు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడతారన్నారు. పొలాల వద్ద, ఇండ్ల వద్ద, వరి కొనుగోలు కేం ద్రాల వద్ద ధాన్యం ఆరబోయడానికి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రోడ్లపై ధాన్యం పోయకుండా ఆయా గ్రామాల పెద్దలు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎవరైనా ధాన్యాన్ని రోడ్లపై నిర్లక్ష్యంగా పోస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మాజీ సర్పంచుల అరెస్ట్



నవతెలంగాణ- పెబ్బేరు

గ్రామాభివృద్ధి కోసం పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ సెక్రటేరియట్ వద్ద ఆందోళనకు సిద్ధమవుతున్న మండలంలోని తాజా మాజీ సర్పంచ్‌లు వనం రాములు, రవీందర్ నాయుడు, గట్టు ప్రభాకర్ గౌడ్, మధును సోమవారం ఉదయం 4 గంటలకే పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ గవర్నమెంట్ ప్రజా పాలన అని చెప్పి పది నెలలు కావస్తున్నా పెండింగ్ బిల్లు చెల్లించలేదన్నారు. బిల్లులు చెల్లించాలని కోరుతూ సచివాలయానికి వెళ్తుంటే పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించాకే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

సర్పంచుల అరెస్ట్ అక్రమం

నవతెలంగాణ- వనపర్తి

పెండిగ్ బిల్లుల కోసం ఆందోళనకు సిద్ధమవుతున్న మాజీ సర్పచ్‌ల అరెస్టు అక్రమమని బీఆర్ఎస్ జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, మండల అధ్యక్షుడు మాణిక్యం, సోషల్ మీడియా కన్వీనర్ సునీల్ వాల్మీకి, యువత అధ్యక్షుడు చిట్యాల రాము సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. సర్పంచులు జ్యోతి మాధవ్‌రెడ్డి, సరిత బాలకృష్ణ, శారద అశన్న, కొండాన్న, జయరాం నాయక్, దేవార్ల నరసింహ మాట్లాడుతూ పెండింగ్ బిల్లుల కోసం ఛలో సెక్రటేరియట్ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయిస్తే ప్రభుత్వం మాపై నిర్బంధం విధిస్తోందన్నారు.అక్రమంగా అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని సర్పంచులు, పార్టీ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు సన్మానం


నవతెలంగాణ- పెబ్బేరు



వనపర్తి జిల్లాకు నూతనంగా వచ్చిన ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ను పెబ్బేరు మండల గౌడ సంఘం నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అక్కి శ్రీనివాసులు గౌడ్, రాష్ట్ర బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి రామన్ గౌడ్, పెబ్బేరు మండల గౌడ సంఘం అధ్యక్షుడు మాచర్ల శ్రీనివాసులు గౌడ్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, డైరెక్టర్ రామన్ గౌడ్, నరసింహగౌడ్, రంగస్వామి గౌడ్, రమేష్ గౌడ్ , బసవరాజ్ గౌడ్, శివశంకర్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, నిరంజన్ గౌడ్, రాజ గౌడ్, కంబాలపురం వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సహజం

నవతెలంగాణ - ఆత్మకూర్



ఉద్యోగికి పదవీ విరమణ సహజమని వక్తలు అన్నారు. సోమవారం ఆత్మకూరు పట్టణంలో వాణి ఫంక్షన్ హాల్ ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఖాజా మైనుద్దీన్ పదవీ వరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలోమాజీ డీఎంహెచ్ఓ శ్రీనివాసులు, ఆసుపత్రి సూపరింటెం డెంట్ హరినారాయణ, వైద్యులు డాక్టర్ శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి.జబ్బార్
- ఘనంగా పాన్‌గల్ మండల మహాసభలు



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వేణుగోపాల్



మహాసభలో ప్రసంగిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జబ్బార్

నవతెలంగాణ-పాన్‌గల్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జబ్బార్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం పాన్‌గల్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సీపీఎం మండల కమిటీ సభ్యుడు ఎం.వెంకటయ్య అధ్యక్షతన మండల ఎనిమిదో మహాసభ నిర్వహించారు. ముందుగా మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చౌరస్తా వద్ద జిల్లా కమిటీ సభ్యుడు సీనియర్ నాయకులు వేణుగోపాల్ పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం సీపీఎం అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాకారులు అమరవీరులను స్మరిస్తూ పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం జరిగిన సమా వేశానికి జబ్బార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమ లు చేయాలని, కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఆరుగ్యారంటీ పథకాలన్నిం టిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు, రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు ఎదుర్కొం టున్న సమస్యలపై చర్చించి సభలో తీర్మానం చేశారు. రెండు ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల్ని అమలు చేసే విధంగా ప్రజా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సీపీఎం మండల కార్యదర్శి ఎం.బాల్యనాయక్ మాట్లాడుతూ పానగల్ మండలంలో పోడు భూముల సమస్యలు, ఇండ్ల స్థలాలు, పింఛన్లు, రైతుల కు గిట్టుబాటు ధర, మహిళలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం కోసం ఉద్యమించాలన్నారు. మహాసభల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బాల్‌రెడ్డి , పుట్ట ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు వేణు గోపాల్, మండల కమిటీ సభ్యులు భగత్‌జీ, వెంకటయ్య ఎం. వెంకటయ్య, ఆంజనేయులు, జమ్ములయ్య, భాస్కర్, భీమయ్య, అనిత, కృష్ణయ్య సూర్యవంశం, రాము , జములయ్య తదితరులు పాల్గొన్నారు.



హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి
- శిక్షణ కార్యక్రమం పరిశీలన

నవతెలంగాణ-మదనపురం



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సురభి

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించేందుకు ఎన్యూమరెటర్లు సుశిక్షుతులు కావడం ఎంతో ముఖ్యమని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. సోమవారం మదనాపురం రైతు వేదికలో కొత్తకోట, మదనాపురం మండలాలకు చెందిన ఎన్యూమరెటర్లకు మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించి మాట్లాడుతూ సర్వేలో ఏ చిన్న అనుమానం లేకుండా పూర్తిస్థాయి శిక్షణ తీసుకోవాలన్నారు. లేని పక్షంలో తప్పులు చేసే అవకాశం ఉంటుందన్నారు. అనుమానాలు ఏమున్నా నివృత్తి చేసుకోవాలని ఎన్యుమారేటర్లను సూచించారు. ఎన్యుమరెటర్లను కొన్ని ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు. సర్వే నమూనా ఫారాలు, సర్వేకు అవసరమైన అన్ని మెటీరియల్ ఎన్యుమారెటర్లకు అందజేసినట్లు తెలిపారు. వాటిని పరిశీలించి అనుమానాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈనెల 6వ తేదీ నుండి కేటాయించిన ఎన్యూమరెటర్ బ్లాక్ ఎక్కడుందో తెలుసుకొని కుటుంబ జాబితా తయారు చేసుకోవాలని, నవంబర్ 9 నుండి ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభించాలని సూచించారు. సర్వేలోని ప్రశ్నావళిలో స్టార్ గుర్తు ఉన్న ప్రతి ప్రశ్నకు సమాధానం కోడ్ రూపంలో నమోదు చేయాల్సి ఉంటుందని, అందువల్ల పుస్తకంలో ఇచ్చిన అన్ని కోడ్ లను జాగ్రత్తగా చూసుకొని అవగాహన చేసుకోవాలని సూచించారు. సర్వే చేసిన నివేదికను ఏ రోజుకు ఆరోజు సంబంధిత పం చాయతీ సెక్రటరీలకు అప్పగించాలని, ఆదేరోజు ఆన్లైన్ లో డేటా నమోదు చేసి రిపోర్టులను జాగ్రత్తగా భద్ర పరచేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి ఎన్యూమరేటర్‌కు తన బ్లాక్ పరిధి ఎక్కడి నుండి ఎక్కడ వరకు ఉందో స్పష్టంగా తెలుసుకోవాలని అందుకు పంచాయతీ సెక్రటరీలు, అధికారులు బాధ్యత తీసుకొని ఎన్యుమరెటర్లకు చూపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మదనాపురం మండల ప్రత్యేకా అధికారి మల్లికార్జున్, తహసీల్దార్ అబ్రహం లింకన్, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా కనీస మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం మదనాపురం మార్కెట్ యార్డులో ఐకేపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వరి ధాన్యం తేమ శాతం, సన్న రకమా లేక దొడ్డు రకమా అనేది ఎలా తెలుసుకోవాలనే విషయాలపై కొనుగోలు కేంద్రం సిబ్బందిని ప్రశ్నించారు. డిజిటల్ క్యాలిపర్ యంత్రం ఉపయోగించే విధానాన్ని పరిశీలించారు. సన్న రకానికి తేమ శాతం 14 ఉండాలని అదే దొడ్డు రకం అయితే 17 శాతం తేమ కలిగి ఉండాలని సూచించారు. దొడ్డు రకం వరి కొనుగోలు కేంద్రాలను వేరుగా ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలపై కొనుగోలు కేంద్రం రిజిస్టర్ నెంబరు, క్రమ సంఖ్య, సన్న రకం లేదా దొడ్డు రకం అనేది గన్ని బ్యాగుపై ముద్రించాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కాశీ విశ్వనాథ్, తహసీల్దార్ అబ్రహం లింకన్, వ్యవసాయాధికారులు, మహిళా సమాఖ్య ఏపీఎం కృష్ణవేణి, అధికారులు, రైతులు తదితరులు ఉన్నారు.

వీవోఏల సమస్యలను పరిష్కరించాలి

- శ్రీనిధి ఇన్సెంటివ్స్ సంఘాలకు ఇవ్వాలి
- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు

నవతెలంగాణ - మదనాపురం



మదనాపురంలో వినతి పత్రం ఇస్తున్న వీవోఏలు

బకాయి శ్రీనిధి ఇన్సెంటివ్స్ గ్రామ మహిళా సంఘాలకు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు డిమాండ్ చేశారు. మదనపురం మండల కేంద్రంలో ఆయా గ్రామాల వీవోఏలు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం కృష్ణవేణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండ్ల రాజు మాటాడుతూ గ్రామ సంఘం నుంచి మూడు వేల రూపాయల వేతనం ఇచ్చి, ప్రతి గ్రామ సంఘానికి ట్యాబ్, నెట్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వ హామీ ప్రకారం 20వేల వేతనం ఇవ్వాలని 20 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్, మండల అధ్యక్షురాలు అలి వేలు, పద్మ అరుణ, శ్రీమణి, ముని కుమార్ నారాయణ, మన్నెం, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నంబాయి మండలంలో..

వీపనగండ్ల: వీవోఏల సమస్యలను పరిష్కరించాలంటూ సోమవారం చిన్నంబాయి మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వ హించారు. ఈ సందర్భంగా వీవోఏల మండల అధ్యక్షుడు నరసింహ మాట్లాడుతూ బకాయిలు ఉన్న శ్రీనిధి ఇన్సెంటివ్ గ్రామ సంఘాలకు ఇవ్వా లన్నారు. గ్రామ సంఘాల నుంచి రూ.3వేల వేత నం ఇప్పించాలన్నారు. ప్రతి గ్రామ సంఘానికి ట్యాబ్ ఇచ్చి నెట్ సౌకర్యం కల్పించాలన్నారు. మూడు నెలల కోసారి వీవోఏల రెన్యువల్ పద్ధతిని మా ర్చాలన్నారు. వీవోఏలకు నెలకు రూ. 20వేల కనీస వేతనం చెల్లించాలని, రూ.20 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం, ఆరోగ్య బీమా కల్పించాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీవోఏల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శాంత య్య, మండల ఉపాధ్యక్షుడు శివుడు, కోశాధికారి సరస్వతి, వివిధ గ్రామాల వీవోఏలు కురుమయ్య, అన్వర్ పాషా, నరసింహ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



చిన్నంబాయిలో ధర్నా చేస్తున్న వీవోఏలు

చట్టాల అవగాహనతో ప్రయోజనాలు

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజని

నవతెలంగాణ- వనపర్తి

చట్టాల అవగాహనతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి. రజని అన్నారు. వనపర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన న్యాయ విజ్ఞాన సదస్సు సోమవారం నిర్వహించారు. న్యాయవాది నరేందర్ బాబు, వైస్ ప్రిన్సిపల్ లావణ్య, అధ్యాపకులు, విద్యార్థులు మరియు లోక్ అదాలత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంపాస్ బాక్సుల పంపిణీ

నవతెలంగాణ -పెబ్బేరు

మండలంలోని గుమ్మడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన రైతుకమిటీ అధ్యక్షుడు కురుమన్న కంపాస్ బాక్సులు పంపిణీ చేశారు. విద్యా కమిటీ మాజీ వైస్ చైర్మన్ పదవ తరగతిలో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థులకు 1116 ద్వితీయ బహుమతి సాధించిన వారికి 500 నగదు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరసింహారావు, వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, ఇందిర వెంకటేశ్వర్లు, వెంకటరామ రెడ్డి రాములు, బ్రహ్మం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాలో 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ అమలు

- ఎస్పీ రావుల గిరిధర్

నవతెలంగాణ - వనపర్తి

శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఈ నెల 30 వరకు 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ రావుల గిరిధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిదే జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ఈ విషయంలో జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు.

పోలీస్ ప్రజావాణికి ఐదు ఫిర్యాదులు

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఐదు ఫిర్యాదులు వచ్చాయని అందులో భూతగాదాలకు సంబంధించినవి మూడు, పరస్పర గొడవలకు సంబంధించిన రెండు ఫిర్యాదులు వచ్చాయని ఎస్పీ తెలిపారు. ఫిర్యాదులు, అర్జీలను స్వీకరించిన ఎస్పీ వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ ఎస్ఐ, సీఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి పరిష్కారానికి సూచనలు చేశారు.

రూరల్ పోలీస్టేషన్ తనిఖీ

వనపర్తి రూరల్ పోలీస్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్లో రికార్డులు, రిసెప్షన్, లాకప్, మెన్ బ్యారెక్, టెక్నికల్ రూం, స్టేషన్ పరిసరాలను పరి శీలించారు. పోలీస్టేషన్ పరిధిలో ఎక్కువగా ఎలాంటి నేరాలు జరుగుతున్నాయి, ఏ ఏ ప్రాంతాల్లో ఎక్కువగా జరుగుతున్నాయి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు వివరాలను 2వ ఎస్సై బాలయ్యను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచించారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ -వీపనగండ్ల

ఉమ్మడి మండల పరిధిలోని దగడపల్లి గ్రామానికి చెందిన నల్లబోతుల క్రాంతికుమార్ రెండు సంవత్సరాల క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందాడు. సోమవారం ఆయన బాల్య మిత్రులు బాధిత కుటుంబానికి రూ. 24 వేల ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో బాల్య మిత్రులు యోగేశ్వర్, నరేష్, అనిత, సునీత, రజిత, గోవింద, చెన్నమ్మ, నీలమ్మ ,హైమావతి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో పెబ్బేరు విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-పెబ్బేరు

హైదరాబాద్ కుక్కట్ పల్లిలో ఈనెల 3వ తేదీన నిర్వహించిన 5వ నేషనల్ కరాటే అండ్ కుంగ్‌ఫూ ఛాంపియన్షిప్ పోటీల్లో పెబ్బేరుకు చెందిన సుమన్ కరాటే కిడ్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కరాటే మాస్టర్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లో బెల్ట్ విభాగంలో దేవాంష్ గోల్డ్ మెడల్, జస్వంత్ సిల్వర్ మెడల్, ఆరెంజ్ బెల్ట్ విభాగంలో గణేష్ గోల్డ్ మెడల్, కార్తికేయ గోల్డ్ మెడల్, సింధు గోల్డ్ మెడల్, గర్ల్స్ వెపన్ విభాగంలో జోషిక గోల్డ్ మెడల్, మేఘన సిల్వర్ మెడల్, స్పైరింగ్ విభాగంలో గౌతమ్‌కుమార్ గోల్డ్ మెడల్ , తస్విన్ గోల్డ్ మెడల్, భీష్మనాథ్ గోల్డ్ మెడల్ సాధించినట్లు పేర్కొన్నారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను మాస్టర్ శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

అయ్యప్పలకు అన్నప్రసాద వితరణ ప్రారంభం

నవతెలంగాణ-పెబ్బేరు

కార్తీక మాసం మొదటి సోమవారం పెబ్బేరు శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్పస్వామి మాలధారులకు అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా గురుస్వాములు మాట్లాడుతూ కార్తీక మాసం మండల కాల దీక్ష ప్రారంభమైందన్నారు. మండల కేంద్రంలో 90 మంది అయ్యప్ప స్వామి మాలాధారణ స్వీకరించారన్నారు. ప్రతి ఏట కార్తీకమాసం మొదటి సోమవారం నుంచి అయ్యప్ప స్వామి భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్న ప్రసాద వితరణ జనవరిలో మకరజ్యోతి దర్శనం వరకు కొనసాగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి వడ్డే ఈశ్వర్, పున్న శ్రీనివాసులు, కర్నాటి శ్రీనివాస్ గౌడ్, మేకల ఎల్లయ్య, మెకానిక్ మధు, కె.వెంకట్రాములు, సత్యానంద రెడ్డి, మిర్చి వెంకటేష్, దామోదర్, సత్యరెడ్డి, పండ్ల రాజు, అనిల్ గౌడ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మదనాపురం విద్యార్థులు

నవతెలంగాణ -మదనాపురం

మదనాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మద్దిలేటి తెలిపారు. సోమవారం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి శంకర్, 8వ తరగతి విద్యార్థిని వైశాలి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు మంగళవారం నుంచి సంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మదనపురానికి చెందిన అడ్వకేట్ అశోక్ గౌడ్ విద్యార్థులను అభినందించి హాకీ స్టిక్స్ అందజేసినట్లు తెలిపారు. అనంతరం మండల విద్యాధికారి ఫారూఖ్ హుస్సేన్, ఉపాధ్యాయులు అభినందించారు.



ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

• సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు

నవతెలంగాణ-కల్వకుర్తి టౌన్

కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు డిమాండ్ చేశారు. పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని కోరుతూ స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు సోమవారం బాధితులతో కలిసి ధర్నా నిర్వహించారు.కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. లక్కీ డీప్ ద్వారా దాదాపు 18 నెలల క్రితం లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ ఇంతవరకు ఇండ్లు కేటాయించలేదని మండిపడ్డారు. గత ప్రభుత్వం హయంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ తదితర సౌకర్యాలు లేకపోవడం వల్ల పెండింగ్‌లో పెట్టినట్లు అధికారులు చెప్పారని గుర్తు చేశారు. ఆ పనులను వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు ఇండ్లను అప్పగించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో విద్యుత్ సౌకర్యంతోపాటు నీటి సమస్య పరిష్కరించారన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు తస్లీమ్ బేగం, జులేకా బేగం, పార్వతమ్మ కృష్ణవేణి, భాగ్యలక్ష్మి, జయమ్మ, శ్రీనివాసులు, అరుణ్ పాల్గొన్నారు.

7న మాదిగల ధర్మయుద్ధ మహాసభ సదస్సు



నవతెలంగాణ-తిమ్మాజిపేట

ఈనెల 7న పాలమూరులో మాదిగల ధర్మయుద్ధ మహాసభ సదస్సును విజయవంతం చేద్దామని ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ గూట విజయ్ మాదిగ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 7న మహబూబ్‌నగర్‌లో జరగబోయే మాదిగల మహాసభ సదస్సుకు, ఢిల్లీ సుప్రీంకోర్టులో ఏబీసీడీ వర్గీకరణ సాధించి మొదటి సారిగా పాలమూరు గడ్డపై అడుగు పెట్టబోతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ హాజరవుతున్న సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలలోని ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్ఎఫ్ అనుబంధం సంఘాల నాయకులు భారీ ఎత్తున మంద కృష్ణ మాదిగ అన్న మీటింగ్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు దానం జగన్ రాజు, మీదింటి సురేందర్, దానం బాలరాజు, కళ్ల రాజు, నాగసాయిలు, బోనసి రాములు, వెంకటయ్య, రమాకాంత్, రాములు, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచుల అరెస్టుని తీవ్రంగా ఖండిస్తున్నాం

• బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జోగు ప్రదీప్

నవతెలంగాణ-తిమ్మాజిపేట

ఏడాది కాలంగా అడిగిన పెండింగ్ బిల్లులు ఇవ్వకపోవటంతో అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదురుకుంటున్నామని పెండింగ్ బిల్లులని వెంటనే విడుదల చేయాలని కోరుతూ శాంతియుత నిరసనకు పిలుపునిచ్చిన మాజీ సర్పంచులను అరెస్ట్ చేయటం సరికాదని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జోగు ప్రదీప్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాంతియుత నిరసనని పోలీసులతో అణగదొక్కడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అరెస్ట్ చేసిన మాజీ సర్పంచులని వెంటనే విడుదల చేయాలని, అలాగే వారికీ రావాల్సిన పెండింగ్ బిల్లులు జాప్యం లేకుండా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మండల నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-బిజినేపల్లి

దళిత జర్నలిస్టు ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు ఆధ్వర్యంలో మండల దళిత జర్నలిస్టు ఫోరం నూతన మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. బిజినపల్లి దళిత జర్నలిస్ట్ ప్రోగ్రాం మండల అధ్యక్షులుగా మిద్దె బంగారయ్య, ప్రధాన కార్యదర్శిగా వట్టెం మహేష్, ప్రచార కార్యదర్శిగా వెంకటస్వామి, కమిటీ సభ్యులుగా కొంగరి మాసయ్య, నరసింహులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర నాయకులు కరిగళ్ళ సుదర్శన్, అవుట శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నరేష్, జిల్లా నాయకులు పట్టాభి, దామోదర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పలకపల్లి పంచాయతీ కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు



నవతెలంగాణ-అచ్చంపేట

అచ్చంపేట మండలం పలకపల్లి గ్రామంలో పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న కళావతి పైన గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి గతంలో కళావతి 2019 నుండి 2022 మే వరకు పలకపల్లి పంచాయతీరాజ్ సెక్రెటరీగా పనిచేశారని, ఆ సమయంలో పంచాయతీకి వచ్చిన నిధులు దుర్వినియోగం చేశారని గ్రామస్తులు ఆరోపించారు. ఆమె విధులు నిర్వహించిన వ్యవధిలో దాదాపుగా 35 లక్షలకు పైగా అవినీతి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు, కేంద్ర ఆర్థిక సంఘం నిధులు, ఉపాధికి సంబంధించిన నిధులు పక్కదారి పట్టించిందని పేర్కొన్నారు. బ్యాంకు ఖాతాలో వేసి డ్రా చేసినట్లు ఆధారాలతో సహా ఆమెపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో మాజీ సర్పంచ్ వెంకటయ్య, జె.రాజు, శంకర్, శ్రీకాంత్, రాములున్నారు.

శాంతినికేతన్ విద్యార్థులకు తృతీయ బహుమతి



నవతెలంగాణ-తెలకపల్లి

మండల కేంద్రంలోని శాంతినికేతన్ విద్యాలయానికి చెందిన విద్యార్థులు సమగ్ర శిక్షక్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కళా ఉత్సవ్ - 2024 పోటీలలో సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్స్ అండ్ ట్రైనింగ్ సెంటర్, హైదరాబాద్‌లో ఈనెల 1, 2 తేదీలలో నిర్వహించిన పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచి శాంతినికేతన్ విద్యాలయం పదో తరగతికి చెందిన వినోద్ కుమార్, భరత్, అజయ్ గౌడ్, తొమ్మిదో తరగతికి చెందిన చరణ్ తేజ్, జస్వంత్ రెడ్డి పాల్గొని మైమ్(ముకాభినయం) విభాగంలో రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ సురేందర్ రావు సోమవారం తెలిపారు. రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం దక్కించుకున్న విద్యార్థులను కరస్పాండెంట్, ఇంద్ర కుమార్, ప్రిన్సిపాల్ దీపా సెబస్టియన్, ఉపాధ్యాయులు అభినందించారు.

6న కలెక్టరేట్ ముట్టడి

పెద్దకొత్తపల్లి : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 6న చేపట్టే కలెక్టరేట్ ముట్టడికి మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని మండల గ్రామ పంచాయతీ కార్మిక యూనియన్ అధ్యక్షులు ఇంద్ర కంటి బాలస్వామి సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నాగర్‌కర్నూల్
మంగళవారం | నవంబర్ 05, 2024 | www.navatelangana.com

హిందీ టీచర్‌ని తిరిగి విధుల్లోకి తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ



నవతెలంగాణ-కోడేరు

విధుల నుంచి తొలగించిన హిందీ టీచర్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వి.రాజేష్ డిమాండ్ చేస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయునికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్న ఆదర్శ పాఠశాల ల్లోని హెచ్‌బీటీ హిందీ టీచర్‌గా గత కొన్ని సంవత్సరాలు నుంచి విధులు నిర్వహిస్తున్న హిందీ టీచర్‌ను విధుల నుండి తొలగించారని, పాఠశాల ట్రాన్స్‌ఫార్మర్‌లో భాగంగా ఒకే పర్మినెంట్ టీచర్ హిందీకి రాగ ఒకరితోనే విధులు నిర్వహించాలని అధికారులు చెప్పారన్నారు. అయితే ఒకే టీచర్‌ను ఐదు క్లాసులకు అనగా 10 సెక్షన్లకు పాఠాలు చెప్పడం అంటే సాధ్యం కానీ పని అని తెలియజేస్తూ అలాగే విద్యార్థులకు చదువుని దూరం చేయడమే తప్ప మరొకటి కాదని తెలిపారు. ఈ విషయంపై అధికారులు స్పందించి విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను కోరారు. ఈ విషయం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నాయకుల దృష్టికి రాగా విద్యార్థులతో కలిసి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయునికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వి.రాజేష్, ఎన్.శ్రీకాంత్, గణేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 49 ఫిర్యాదులు



నవతెలంగాణ-కందనూలు

నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశం మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 49 ఫిర్యాదులు అందాయని జిల్లా అదనపు కలెక్టర్లు కె.సీతారామారావు, దేవ సహాయంలు తెలిపారు. ఫిర్యాదుదారుల నుండి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత ఆయా శాఖల అధికారులకు అందజేశారు. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుల్లో ధరణికి సంబంధించి-21, రెవిన్యూకు సంబంధించి-17, డీపీఓకు-3 డిస్టిక్ ఎంప్లాయిమెంట్‌కు-2, డీఈఓకు-2, డీఏఓ, డీఆర్‌డీఓ, డీసీఓ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా అధికారులతో అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులు పరిశీలన చేసి ఫిర్యాదుదారునికి తగిన సూచనలు, సలహాలు ఇస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ చిన్న ఓబులేసు, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

• పోలీస్ ప్రజావాణిలో 13 ఫిర్యాదులు

నాగర్‌కర్నూల్ రూరల్ : జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 13 మంది తమ ఫిర్యాదులను అందజేశారు. భూమి పంచాయతీలు -9, సమస్యలపై న్యాయం కోసం -3, భార్యాభర్తల మధ్య పంచాయతీ -1 వచ్చాయి. జిల్లా అదనపు ఎస్పీ సిహెచ్.రామేశ్వర్ ప్రజావాణికి వచ్చిన వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత ప్రాంతీయ పోలీస్ అధికారులకు సమస్యలను పరిశీలించి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.



వీవోఏలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

• సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డి.ఈశ్వర్



నవతెలంగాణ-పెంట్లవెల్లి

ఐకేపీ వీవోఏలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డి.ఈశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం ఐకేపీ వీవోఏల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల సమాఖ్య కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఇన్చార్జి ఏపీఎం మంతమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వీవోఏలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీనిధి ప్రోత్సకాలిచ్చి పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీవోఏలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చెయ్యకుండా వీవోఏ లను అనేక ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఏ పథకాన్ని ప్రవేశపెట్టిన కిందిస్థాయిలో ప్రజలకు చేరవేసే దాంట్లో కీలక పాత్ర వీవోఏలు పోషిస్తున్నారన్నారు. అలాంటి వారికి కనీస వేతనం రూ.26వేలు ఇచ్చి, రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించి, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించి, ఐడి కార్డులు, ఫోన్ టాబ్, యూనిఫామ్ ఇవ్వాలన్నారు. ఐకేపీ వీవోఏల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేష్, ఐకేపీ వీవోఏల మండల అధ్యక్షులు వెంకటస్వామి, కార్యదర్శి వసంత, వీవోఏలు మురళి, మధు, మురళి నాయక్, ఈశ్వరమ్మ, రేణుక, మాధవి లత తదితరులు పాల్గొన్నారు.



తెలకపల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల వీవోఏలు సోమవారం ఏపీఎం నిరంజన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల వీఓఏలు పాల్గొన్నారు.

వంగూరు : మండలం మహిళా సమైక్య ఆవరణలో వీవోఏల సమస్యల పైన ధర్నా నిర్వహించారు. అనంతరం మండల ఏపీఎం చంద్రయ్యకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మీసాల జంగయ్య, ప్రధాన కార్యదర్శి బండపల్లి రామస్వామి, మండల కోశాధికారి రాజేందర్, గౌరవ అధ్యక్షులు లక్ష్మి, సువర్ణ, బాలస్వామి, తిరుపతి, సైదులు, దివ్య, రూపిని, శిరీష, విష్ణు, భాస్కర్, అలివేల, శ్రీదేవి, విమలమ్మ, రాజు, శివలీల పాల్గొన్నారు.





పెద్దకొత్తపలి : ఐకేపీ వీవోఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సోమవారం మండల సమాఖ్య కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏపీఎం అరుణకు అందజేశారు. కార్యక్రమంలో వీవోఏల మండల అధ్యక్షుడు గండు వెంకటయ్య, కార్యదర్శి జగన్మోహన్, ఆకారం రాజు, హరిషా, ప్రవీణ్, గిరిజ, నవనీత, గోపాల్ నాయక్, సురేఖ, రజని, వెంకటస్వామి, నీలమ్మ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ : ఐకేపీ వీవోఏలుగా పనిచేస్తున్న గ్రామస్థాయి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వెల్దండ వీవోఏల సమైక్య ఆధ్వర్యంలో సోమవారం ఐకేపీ కార్యాలయం ఎదుట ధర్నా నిరసన చేశారు. ఏపీఎం రాములకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు చంద్రశేఖర్, మణిపాల్, మండల కార్యదర్శి వసంత, జహేదా, జ్యోతి, సత్యవతి, సునిత, లక్ష్మీ ధన్సింగ్ తదితరులు పాల్గొన్నారు.



చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు : అడిషన్ ఎస్పీ



నవతెలంగాణ-తెలకపల్లి

భారత రాజ్యాంగం ప్రకారం 14వ నిబంధన చట్టం ముందు అందరూ సమానులేనని ప్రతి ఒక్కరూ గ్రామాలలో నేటికి కొనసాగుతున్న మూఢనమ్మకాల నిర్మూలనకు కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా అడిషనల్ ఎస్పీ రామేశ్వర్ అన్నారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని తాళ్లపల్లిలో న్యాయ సలహాలు, సైబర్ క్రైమ్ అంశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, చట్టాన్ని అతిక్రమించరాదని సూచించారు. కొంత మంది యువకులు ఈ మధ్యకాలంలో కొన్ని మాదకద్రవ్యాలకు అలవాటు పడి ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వాటి వల్ల సమాజంలో అశాంతి ఏర్పడి కుటుంబాలలో, సమాజంలో గౌరవం తగ్గి శిక్షలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా కుటుంబ సభ్యులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలలో విపరీతమైన మూఢనమ్మకాల వల్ల కుటుంబాలలో క్షణికావేశాలలో తప్పుడు నిర్ణయాల వల్ల కుటుంబాలలో ఇబ్బందులు జరుగుతున్నాయని ఇటీవల జరుగుతున్న కొన్ని నేరాలపై అవగాహన కల్పించారు. గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజలు అడిగిన సమస్యలను వారు నివృత్తి చేశారు. కార్యక్రమంలో సీఐ కనకయ్య, స్థానిక ఎస్సై బి.నరేష్, పోలీస్ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని వైద్య సిబ్బంది

నవతెలంగాణ-కోడేరు

మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్‌తో సహా సిబ్బంది సమయపాలన పాటించక పోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సోమవారం మధ్యాహ్నం 12గంటల వరకు సంబంధిత డాక్టర్ లేకపోవడంతో రోగులు అసహనానికి గురయ్యారు. యునాని డాక్టర్ మాత్రమే విధులకు హాజరయ్యారు. ఇద్దరు నర్సులు ఉన్నప్పటికీ గాయాలైన వారికి బ్యాండేజ్‌లు వెయ్యమంటే తాము ఫీల్డ్‌లో పనిచేసేవారని బ్యాండేజ్‌లు వేయాల్సిన అవసరం మాకు లేదని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. మోడల్ స్కూల్ నుంచి వచ్చిన ఒక విద్యార్థి తన గాయానికి బ్యాండేజ్ కట్టుకొని మండల కేంద్రానికి చెందిన బొక్కలయ్య అనే రోగికి కూడా తనే ప్రథమ చికిత్స బ్యాండేజీ వేసి పంపించారు. మధ్యాహ్నం 12గంటల తర్వాత డాక్టర్ దశరథం విధులకు హాజరయ్యారు. మధ్యాహ్నం 12గంటలకు హాజరైతే ఎలా అని ప్రశ్నిస్తే తనది వాస్తవ పోస్ట్ అంబటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రమని, కోడేరు కాదని ఉన్నతాధికారులు అంబటిపల్లికి పంపడం లేదన్నారు. ఈ విషయమై తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.నరసింహ జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓను సంప్రదించగా భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగనీయకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు స్పందించి కోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న డాక్టర్లను, సిబ్బందిని సరిచేసి విధులు సక్రమంగా నిర్వర్తించేందుకు తగు చర్యలు తీసుకోవాలని నరసింహ డిమాండ్ చేశారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-పెంట్లవెల్లి

జటప్రోలు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు సోమవారం పంపిణీ చేశారు. మరికంటి గోవిందు రూ.25వేలు, దామోదర్ రెడ్డి రూ.20వేల చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ పేద వర్గాలకు వరమని అనారోగ్యంతో బాధపడుతున్న ఏ బాధితునికైనా రాజకీయాలకు అతీతంగా అందించటానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న బాధితులు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ భీమ్ రెడ్డి, నాయకులు నాగిరెడ్డి, జటప్రోలు కాంగ్రెస్ అధ్యక్షులు నరేష్ యాదవ్, మాజీ నెంబర్ బొజ్జన్న, గోపాల్, జమిల్, పెద్ద శ్రీను, నరేందర్, దయాకర్, సాకలి శ్రీను, శివ పాల్గొన్నారు.





పెద్దకొత్తపల్లి : మండల కేంద్రానికి చెందిన దాదే చంద్రయ్యకు రూ.60వేలు, దండు రాముడు రూ.37,500, కె.ధనలక్ష్మికి రూ.25వేలు మంత్రి జూపల్లి సహకారంతో మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను వారి కుటుంబ సభ్యులకు మండలం ముఖ్య నాయకుడు దండు నరసింహ, కాంగ్రెస్ మండలం అధ్యక్షుడు తగిలి కృష్ణయ్య అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు శశికళ శివశంకర్, కనిరెడ్డి అశోక్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ దండు చంద్రయ్య, మాజీ వార్డు మెంబర్ గడ్డిగోపుల ఎల్లయ్య రాగుల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అవగారి లక్ష్మయ్య, బ్యాగరి మల్లేష్, రాముడు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-కందనూలు

నాగర్‌కర్నూల్ మున్సిపల్ పరిధిలోని 18, 19వ వార్డులలో 1 కోటి 20 లక్షల రూపాయలతో 5 చోట్ల 1400 మీటర్ల పొడవు కొత్తగా వేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్సీ కుచుకుళ్ల దామోదర్ రెడ్డి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులలో సుమారు 1 కోటి 20 లక్షల రూపాయలతో 1400 మీటర్ల పొడవు కొత్తగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించామని, మిగతావి పరిపాలన అనుమతులతో మిగిలిన రోడ్లను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. పట్టణంలో పెద్దఎత్తున అన్ని వార్డుల్లో తవ్వీపెట్టిన సీసీ రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. రోడ్డు వెడల్పు ఎక్కడైనా తగ్గితే ఆ ప్రదేశంలో ఉన్న ఇంటి వాళ్ళతో మాట్లాడి ఒప్పించి వెడల్పు తగ్గకుండా వెయ్యాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జక్క రాజ్‌కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు బచ్చన్న, కావలి శ్రీను, సునేంద్ర, ప్రజాప్రతినిధులున్నారు.

సమాచార హక్కు రక్షణ చట్టం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా మొగిలి శేఖర్

నవతెలంగాణ-ఉప్పునుంతల



సమాచార హక్కు రక్షణ చట్టం-2005 రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా, నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలానికి చెందిన మొగిలి శేఖర్‌ను నియమించారు. అంతకముందు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల ఇంచార్జ్‌గా ఉన్న మొగిలి శేఖర్‌ను ఆయన సేవలను గుర్తించి, రాష్ట్ర మహాసభలో రాష్ట్ర నియామక ఇంచార్జి చల్లమాళ్ళ సుధాకర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భోజరాజు ప్రశాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు, ఆయనకు నియామక పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మొగిలి శేఖర్ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో బాధ్యతలు అప్పకించిన రాష్ట్ర కమిటీకి ప్రతేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నేను అందరి సలహాలతో ఈ సొసైటీ నీ ముందుకు తీసుకెళ్తానన్ని, దీని ద్వారా ప్రభుత్వ సంక్షేమ పతకాల నిధుల గురించి, వాటి వినియేగం గురించి తెలుసుకోవచ్చుఅని, ఈ సమాచార హక్కు చట్టం అనేది, ప్రజల చేతిలో ఒక ఆయుధం లాంటిదన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-బిజినేపల్లి



మండల కేంద్రంలోని మిద్దె సీతమ్మ అనే మహిళ మరణించింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ మండల రైతు సమితి అధ్యక్షులు నెల్లికంటి మహేష్ రెడ్డి, ఎంపీటీసీ బాలస్వామి వారి కుటుంబాన్ని పరామర్శించి వారి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నెల్లికంటి మహేశ్వర్ రెడ్డి బాధిత కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మంగి కృపయ్య, మంగి మురళి, కంపెనీల పర్వతాలు, గుంపాల రాములు, ముల్గర పరశురాములు, కావలి అంజి, సాకలి సాయి, మిద్దె కురుమయ్య ఉన్నారు.

పాల బిల్లులు చెల్లించేందుకు కృషి చేస్తా

• విజయ డైరీ చైర్మన్ నర్సయ్య యాదవ్


నవతెలంగాణ-అచ్చంపేట



విజయ డైరీకి పాలు పోస్తున్న పాడి రైతులకు క్రమం తప్పకుండా బిల్లులు చెల్లించేందుకు కృషి చేస్తానని విజయ డైరీ చైర్మన్ నర్సయ్య యాదవ్ అన్నారు. సోమవారం ఆయన పదవి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి రైతు విజయ డైరీకి పాలు పోసి ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాడి రైతుల సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించి, పాడి పశువుల వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. రైతుల ను ప్రోత్సహించేందుకు దాణ పంపిణీ విస్తృతంగా నిర్వహిస్తామన్నారు. విజయ డైరీ పాల సేకరణ పెంచేందుకు కృషి చేస్తామన్నారు. పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా చైర్మన్‌ను పలువురు రాజకీయ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గౌరీ శంకర్, నాయకులు అంతటి మల్లేష్, రామనాథం, వై.శ్రీనివాసులు, కాశన్న యాదవ్, శంకర్, విజయ డైరీ మేనేజర్ కృష్ణ, తదితరులు ఉన్నారు.

'విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి'

నవతెలంగాణ-వెల్దండ



మండల కేంద్రంలోని హాస్టల్లో నెలకొన్న విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసిల్దార్ కార్తీక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. అలాగే మండల కేంద్రంలో గల బీసీ హాస్టల్‌కు పెయింటింగ్ వేయించి మరమ్మతులు చేపట్టాలన్నారు. మినరల్ వాటర్‌తోపాటు వసతి గృహంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గిరిజన బాలికల కళాశాల హాస్టల్ చుట్టూ ప్రహరి గోడ నిర్మించాలని, హాస్టల్లో నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వెల్దండ ప్రభుత్వ జూనియర్ కళాశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని వినతిలో కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సంతోష్, మల్లేష్, చింటూ, హాస్టల్ విద్యార్థినిలు స్పందన, శైలజ, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో రాజకీయం లేకుండా నిరుపేదలకు న్యాయం చేయాలి : డీహెచ్‌పీఎస్

నవతెలంగాణ-తాడూరు



ఇందిరమ్మ ఇళ్లలో రాజకీయం లేకుండా నిరుపేదలకు, దళితులకు న్యాయం చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము భరత్ కోరారు. సోమవారం ఆయన దళిత హక్కుల పోరాట సమితి ప్రతినిధులతో పలు గ్రామాలలో పర్యటించారు. యాదిరెడ్డిపల్లిలో పత్తి తీస్తున్న కూలీలు, రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడు తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన దీపావళి కానుక అని చెప్పి ఇందిరమ్మ ఇల్లు నియోజకవర్గానికి 3వేలు ఇస్తామని చెప్పి అమలు చేయకుండా దాచి పెట్టారు. ఇప్పటికైనా దాన్ని అమలు చేసి నిరుపేద దళిత బహుజనులను ఇల్లు లేని నిరుపేద అర్హులను ఆదుకోవాలన్నారు. దళితులకు కేటాయించిన ఇండ్లు, రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఇళ్ల స్థలాల విషయంలో రాజకీయ జోక్యం లేకుండా నిష్పక్షపాతంగా ప్రజా పాలన అని చెప్పుకునే ప్రభుత్వం గ్రామసభలలో అందరి సమక్షంలో అర్హులైన వారిని ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు ఉల్పర రాము డు, మండల ప్రధాన కార్యదర్శి కొమ్ము రాములు, ఉపాధ్యక్షులు శివ, నాయకులు బి.చందు, రామచంద్రుడు, నాగరాజు, అనిల్, అనూష, అంకిత ఉన్నారు.

నవతెలంగాణ 4
నారాయణపేట
మంగళవారం నవంబర్ 05, 2024 www.navatelangana.com

అదనపు (రెవెన్యూ) కలెక్టర్‌గా బెన్‌శాలం



నవ తెలంగాణ - నారాయణపేట

నారాయణపేట (రెవెన్యూ) అదనపు కలెక్టర్‌గా బెన్ శాలం సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మర్యాదపూర్వకంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నారాయణపేట జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. పదవి బాధ్యతలు స్వీకరించిన అధనపు(రెవెన్యూ) కలెక్టర్ బెన్‌శాలం యాదాద్రి భువన గిరి జిల్లా నుంచి నారాయణపేటకు బదిలీపై వచ్చారు. నారాయణపేట జిల్లాకు తన వంతు రెవెన్యూ శాఖలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ప్రజావాణికి ఎనిమిది ఫిర్యాదులు : ఎస్పీ



నవ తెలంగాణ - నారాయణపేట

సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో బాగంగా వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను ఎస్పీ జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ ప్రజావాణి ప్రజలను స్వీకరించారు. మొత్తం 8 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ యోగేష్ గౌతం ఒక ప్రకటనలో తెలిపారు వచ్చిన ఫిర్యాదులను చట్టప్రకారం పరిశీలించ వలసిందిగా సీఐ, ఎస్సై లకు సూచించారు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలని ఫిర్యాదు దారులకు ఎస్పీ సూచించారు. భూములకు సంబంధించి గొడవలు పెట్టుకోరాదని, అందరూ సామరస్యంగా మాట్లాడుకొని పరిష్కరించుకోవాలి కోరారు. అధికారులు బాధితులు తీసుకు వచ్చే ఎలాంటి ఫిర్యాదులు పెండింగ్లో ఉంచ రాదని వాటిని పరిష్కరించాలని, ఎస్పీ ఫోన్లో మాట్లా డి సంబంధిత అధికారులకు సూచించారు.ఫిర్యాదులు పెండింగ్లో ఉంటే వాటికి సంబంధించిన సమాచారాన్ని బాధితులకు తప్పకుండా తెలపాలని సూచించారు.శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం పని చేస్తుందని అన్నారు. పోలీసులు ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించి వారికి సరైన న్యాయం అందించి భరోసా, భద్రత కల్పించాలని సూచించారు. ప్రస్తుతం అధునాతన టెక్నాలజీ పెరుగుతున్న ందున సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి, కావున ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సమయంలో డయల్ 100 లేదా 1930 కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత : ఎస్ఐ



నవతెలంగాణ - నారాయణపేట

జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ ఎక్స్ రోడ్ దగ్గరలోని సీ.సురేష్ కిరాణా షాప్‌లో ప్రభుత్వ నిషేధిత అంబర్, జర్ధ గుట్కా ప్యాకెట్ల నిల్వ ఉంచి ప్రజలకు అమ్ముతుండగా పక్క సమాచారంతో టాస్క్ ఫోర్స్, నారాయణపేట పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి రూ.7,800ల విలువగల గుట్కా ప్యాకెట్లను పట్టుకుని పోలీస్ స్టేషన్ కు తరలించి సురేష్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. నారాయణపేట పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ప్రభుత్వ నిషేధిత గుట్కా ప్యాకెట్లను నిల్వ ఉంచిన, అమ్మిన, రవాణా చేసిన అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై హెచ్చరించారు.

జిల్లా స్థాయిలో సత్తా చాటిన .. మాగనూర్ విద్యార్థులు



నవతెలంగాణ - మాగనూర్

ఎస్ జీ ఎఫ్ అథ్లెటిక్స్ పోటీలు నారాయణపేటలో జరిగాయి. ఈ పోటీలలో నిహారిక 9వ తరగతి లాంగ్ జంప్‌లో మొదటి స్థానం శ్రావణి 9వ తరగతి డిస్కస్త్రో లో మొదటి స్థానం, రాకేష్ పదవ తరగతి హై జంప్‌లో జిల్లా మొదటి స్థానం, శివ 9వ తరగతి హై జంప్ లోజిల్లా మొదటి స్థానం, సాధించి మహబూబ్‌నగర్‌లో జరిగే జోనల్‌స్థాయి క్రీడల్లో మన జిల్లా తరఫున ఆడుతున్నట్లు రాకేష్ శర్మ ఫిజికల్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల ఎంపిక కావడం పట్ల ఎంఈఓ మురళీధర్ రెడ్డి వారు పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు అభినందించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

నవ తెలంగాణ - మాగనూరు

మాగనూరు మండల పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాల గుర్రావు లింగంపల్లి గ్రామం నుంచి మాగనూరు పాఠశాలకు బదిలీ అయిన సందర్భంగా పూర్వ బడిలో విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఎన్ బలరాం వడ్వాట్ నుంచి గుర్రవు లింగంపల్లికి బదిలీపై వచ్చి ఇక్కడికి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఆరు సంవత్సరాల నాలుగు నెలలుగా పిల్లలకు చక్కటి చక్కటి విద్యను అందించి ఈ ఉపాధ్యాయుడు ఆయన సేవలు బోధన పిల్లలకు చాలా చక్కగా బోధించారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆయనకు ఎల్లవేళలా అరుణపడి ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మురళీధర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపా ధ్యాయులు వినోద్ కుమార్, కొత్తపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసిం హారెడ్డి, తాళంకేరి ప్రధానోపాధ్యాయులు రవి, ఎంఆర్పీ బృందం ఎల్లా గౌడ్, కృష్ణ, ఆప్ కమిటీ చైర్మన్ లక్ష్మి నరసింహులు, మాజీ చైర్మన్ కృష్ణయ్య గౌడ్, అంగ న్వాడీ టీచర్ పద్మ, నరసింహులు, నరేష్, చందు, రజిత , గోవిందు, అనిల్, లక్ష్మణ్, గణేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



సత్వరమే ఫిర్యాదులను పరిష్కరించాలి : కలెక్టర్



నవతెలంగాణ - నారాయణపేట

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహి ంచిన ప్రజా వాణి కార్యక్ర మానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 15 అర్జీ లు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. అర్జీలను పెండి ంగ్‌లో పెట్టకుండా ఎప్పటి కప్పుడు పరిశీలన జరు పుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామచందర్, ఏవో జయసుధ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గత బీఆర్ఎస్ విధానాలే..
ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తుంది

- రైతులు, కూలీలు,కార్మికులు, ప్రజల కోసం పనిచేసేది కమ్యూనిస్టులే
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ

నవతెలంగాణ - మక్తల్

గత బీ.ఆర్.ఎస్ ప్రభుత్వ విధానాలే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ విమర్శించారు . మక్తల్ నియోజక వర్గ కేంద్రంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం రెండోరోజు జరిగిన సీపీఐ(ఎం) జిల్లా రెండవ జిల్లా మహాసభలో ఆయన ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. గత ప్రభుత్వ నిరం కుశ నియంతృత్వ పాలనకు ప్రజలు విసిగిపోయి కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే.. రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని, రైతు భరోసా రైతులకు ఇవ్వడం లేదని, కూలీలకు, కౌలు రైతులకు అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సంవత్సరం కాలం దగ్గర వస్తున్న ఇందిరమ్మ ఇల్లు ఇంకా ప్రారంభమే కాలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయక సతికిల పడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ముఖ్యమంత్రి మార్పిడి అనే అంశాన్ని తెరపైకి తీసుకొస్తూ ప్రజల దృష్టిని మరల్చే తానా దొల్లతనం కనబడకుండా చూస్తున్నారని విమర్శించారు. అధికార పీఠం కోసం పీకులాట కార్యక్రమంలో ప్రజలకు ప్రయోజనం లేదన్నారు.కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రైతులు, కార్మికులు, ప్రజలకు నష్టం కలిగించే విధానాలను అవలంబిస్తున్నదని, మరోవైపు 14 వేల లక్షల కోట్లు బడా పారిశ్రామిక వేత్తలు ఆదానీ, అంబానీ, టాటా లకు మాఫీ చేశారని విమర్శించారు . మోడీ ఇచ్చిన హామీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు నిత్యావసర ధరల తగ్గింపు హామీలు అమలు కాలేదని విమర్శించారు. బొగ్గు ,విద్యుత్, బ్యాంకింగ్ , తపాలా విమానయానం ,రైల్వే లు తదితర దేశ సంపదను బడా పారిశ్రామిక వేత్తలకు ధారా దత్తం చేస్తూ భారత్ మాతాకీ జై అంటూన్నారన్నారు. సామాజిక న్యాయం కోసం కులగణన చేయాలని డిమాండ్ ఉన్న నరేంద్ర మోడీ ప్రభు త్వం పట్టించుకోవడంలేదని ఆగ్ర హం వ్యక్తం చేశారు .డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ రాసిన లౌకిక, ప్రజాస్వామిక , సామ్య వాద విలువలు కలిగిన భారత రాజ్యాంగంకు తూట్లు పొడుస్తున్నారని అన్నారు . గాంధీ కాదు గాడ్సే నిజమైన నాయకుడు అంటూ విష ప్రచారం చేస్తున్నారన్నారు. మతోన్మాద విధానాలతో ఫాసిజం వైపు అడుగులు వేస్తూ సమాజంలో విద్వేషం నింపుతున్నారని అన్నారు. మన ధర్మం సనాతన ధర్మం హిందూ రాజ్యం అంటే గత కాలంలో జ్యోతి రావ్ పూలే, డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్, రాజారాం మోహన్ రాయ్, గురజాడ అప్పారా వు, గుర్రం జాషువా ,వంటి మేధావులు ఎందరో సంఘ సంస్కర్తలు చేసిన సేవలు నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ(ఎం) పార్టీ జిల్లా ప్రతినిధుల మహాసభలో సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టీ సాగర్ మాట్లాడారు. అంతకుముందు ప్రతినిధుల సభ ప్రారంభ సూచనగా మాగనూరు మండల సీనియర్ నాయకులు భరత్ కుమార్ అరుణ జెండాను ఎగరవేశా రు. సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి జీ. వెంకట్రామరెడ్డి జిల్లాలో పార్టీ నిర్వహించిన పోరాటాల కార్యక్రమ నివేదిక ప్రవేశపెట్ట గా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, బీ బాల్‌రామ్ గోవిందరాజు అధ్యక్షత వహించారు. సీపీఐ(ఎం) జిల్లా నాయకులు పుంజనూరు ఆంజనేయులు, అంజిలయ్య గౌడ్ భరత్ కుమార్, బాలప్ప, శివకుమార్,దస్తప్ప బాలు ,నరసింహ తదితరులు తో పాటు 100 మంది పాల్గొన్నారు.





శాంతి భద్రతల పరిరక్షణలో..
డయల్ 100 సేవలు కీలకం : ఎస్పీ

నవ తెలంగాణ - నారాయణపేట

ఆపదలో ఉన్న ప్రజలకు తక్షణమే సహాయ సహకారాలు అందించే సదుద్దేశంతో ప్రారంభించబడిన డయల్ 100 సేవల నిర్వహణ పై ఎస్పీ యోగేష్ గౌతమ్ బ్లూ కోర్ట్స్, పెట్రో కార్ సిబ్బందికి, కంట్రోల్ రూమ్ పోలీసులకు దూర దృశ్య మధ్యమం ద్వారా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారు చేయవలసిన విధులు, పాటించవలసిన నియమాలు కీలకం అని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రతి రోజు ఎలాంటి సమస్యలపై డయల్ 100 కాల్స్ వస్తు న్నాయా వచ్చినప్పుడు ఏం చర్యలు తీసుకుంటున్నారని ఎస్పీ సిబ్బందిని అడిగి తెలుసుకొని పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతలను కాపాడటంలో సమస్యలతో ఉన్న ప్రజల నుంచి వచ్చే డయల్ 100 కాల్స్ పట్ల వేగవంతంగా స్పందించి అతి త్వరగా సంఘటన స్థలానికి చేరుకుని బాధితుల సమస్యలకు పరిష్కారం అందించే దిశగా డయల్ 100 పోలీసులు కృషి చేయాలన్నారు. డయల్ 100 కాల్స్ వచ్చినప్పుడు హైదరాబాద్ కంట్రోల్ రూమ్ నుంచి నేరుగా డయల్ 100 డ్యూటీలో ఉన్న పీసీకి, ఎస్హెచ్ఓ కి, కంట్రోల్ రూమ్ కి సమాచారం వస్తుందని వాటిని వెంటనే గుర్తించి సంఘటన స్థలానికి డయల్ 100 పోలీసులు చేరుకునే విధంగా



చర్యలు తీసుకోవాలని సూచించారు.ముఖ్యంగా డయల్ 100 కాల్ వచ్చినప్పటి నుంచి త్వరగా సంఘటన స్థలాలకు చేరుకునేంత వరకు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న తర్వాత బాధితులకు న్యాయం చేకూరే విధంగా విచారణ చేపట్టాలని, సమస్య పెద్దదైతే ఉన్నతాధికారులకు సమాచారం అందించి స్టేషన్ సిబ్బందిని వినియోగించుకొని సమస్యను పరిష్కరించాలని సూచించారు.జిల్లా పోలీసులు అతి తక్కువ సమయం లో సంఘటనా స్థలాలకు చేరుకోవాలని సూచించారు. డయల్ 100 వినియోగించే టాబ్ లను జాగ్రత్తగా వినియోగించి 24 గంటలు నెట్వర్క్ లో అందుబాటులో ఉండే విధంగా చూసుకుంటూ, అనవసరమైన ఇతర ఏ అప్లికేషన్లను వినియోగించకుండా ఉండాలన్నారు. సిబ్బంది స్వీయ ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ డయల్ - 100 విధులను నిర్వర్తించడం ద్వారా రాష్ట్ర పోలీసుల కీర్తి జిల్లా పోలీసుల కీర్తి పెరిగేలా చేస్తుందని అన్నారు. రాత్రి సమయాలలో ముఖ్యంగా పట్టణాల ప్రాంతాలలో గస్తీ లు నిర్వహిస్తూ ఎటువంటి అసాంఘిక సంఘటనలు జరగకుండా పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంటీఓ ఆర్ఎస్ఐ శివశంకర్, ఐటీ కోర్ టీమ్, జిల్లాలోని బ్లూ కోట్స్, పెట్రో కార్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి..
సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే

- తహసీల్దార్, ఎంపీడీఓ





నవ తెలంగాణ - క్రిష్ణా

గ్రామాలలో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను తప్పులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ దయాకర్ రెడ్డి, ఎంపీడీవో జానయ్య సూచించారు, సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాల సమగ్ర కుటుంబ ఇంటింటా సర్వేను ఎలాంటి తప్పులు జరగకుండగా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నాగభూషణ్, ఎమ్మార్ అజయ్ ఎన్యుమారెటర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి అవగాహన కల్పించారు. ప్రతి కుటుంబీకులతో పూర్తి సమాచారం తీసుకొని రికార్డులలో పొందుపరచాలని ఈ నెల 6 తేదీ నుంచి 18 వరకు సర్వేను నిర్వహించే ఈ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించి వారి నుంచి పూర్తి వివరాలను నమోదు చేయాలన్నారు. పూర్తి అవగాహన ఉన్నప్పుడే సర్వే పకడ్బందీగా చేపట్టేందుకు ఆస్కారం ఉంటుందని, ఎటువంటి సందేహాలు ఉన్నా అవగాహన కార్యక్రమంలో నివృత్తి చేసుకొని రేపటి నుంచి ప్రతి గ్రామంలో సర్వే నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో సుదర్శన్ గౌడ్, ఎంపీఓ విజయలక్ష్మి, ఎంఈఓ నిజముద్దీన్, ఏపిఎం బసవరాజ్, అంగన్వాడీ సూపర్‌వైజర్ రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - మాగనూర్

మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎన్యూమరేటర్స్, సూపర్‌వైజర్లకు సామాజిక, ఆర్థిక , విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేపై ఎంపీడీవో రహమతుద్దీన్ శిక్షణ ఇచ్చారు. మండలంలో 51 మంది ఎన్యూమరేటర్లు అదేవిధంగా 5గురు సూపర్‌వైజర్లకు సోమవారం శిక్షణ ఇచ్చారు. నవంబర్ 6 నుంచి 18 తేదీ వరకు సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. 19వ తేదీ నుంచి 30వ తేదీ వరకు డాటా ఎంట్రీ చేస్తారని తెలిపారు. ఈ శిక్షణలో ప్రోగ్రాం టీఓటీ తిమ్మన్న , కోల్పూర్ హెచ్‌ఎం , బలరాం మాగనూరు స్కూల్ టీచర్, ఎంఈఓ , ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్ సిఫారసుల ప్రకారం..గిట్టుబాటు ధర చెల్లించాలి

- ఏఐపీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ.యాదగిరి

నవ తెలంగాణ - నారాయణపేట

ఖరీఫ్ సీజన్లో రైతులు పండించిన పంటలన్నిటికీ స్వామినాథన్ సిఫారసుల ప్రకారం గిట్టుబాటు ధరలు నిర్ణయించాలని, మద్దతు ధరలతో పాటు ప్రభుత్వం బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలని డిమాండు చేస్తూ సోమవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు దగ్గర అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు సీ. భగవంతు అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐపీకేస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్ లో రైతులు పండించిన పంటలన్నిటికీ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం సమగ్ర ఖర్చుల ప్రతిపాదికన కనీసం మద్దతు ధరలు నిర్ణయించి ప్రభుత్వమే విస్తృతంగా కొను గోలు కేంద్రాల ద్వారా వేగవంతంగా కొనుగోళ్లు చేయా లని, ప్రభుత్వం వరి సన్నా రకం మాత్రమే బోనస్ ప్రకటించి మిగతా పంటలు పండించిన రైతులను విస్మరించడం సరికాదన్నారు. ప్రభుత్వ ప్రకటించిన అన్ని రకాల వరి, పత్తి, కంది, వేరుశనగ, మినుము, మొక్క జొన్న, చెరుకు, పసుపు,పంటలన్నిటికీ బోనస్ ఇవ్వాలన్నారు. పత్తి కొనుగోలు కేంద్రంలో సీసీఐ అధికారులు తేమ పేరుతో రైతులను వాపస్ పంపడం జరుగుతుందన్నారు. దీని కారణంగా వ్యాపారులకు పరోక్షంగా సహకరించి లాభాలు కట్ట పెడుతున్నారు. తేమ శాతాన్ని 10 నుంచి 20 శాతం వరకు ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలన్నారు. ఈ ఖరీఫ్ సీజన్ లో రైతులకు ఇవ్వాల్సిన రైతు భరోసాను ప్రభుత్వం



ఎగ్గొట్టకుండా ఖరీఫ్, రబీ 2 పంటలు కలిపి రూ.15వేలు రైతు ఖాతాలలో జమ చేయాలన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ జిల్లాలో మొత్తం రైతులు 99 వేల 837 మంది రైతులకు 59, 839 మంది రైతులకు మాత్రమే మాఫీ చేశారని, దాదాపు 40 వేల రైతులకు రుణమాఫీ చేయకపోవడం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా వారినివంచించడం, మోసగించడం సరికాదన్నారు. రైతు నిర్లక్ష్య వైఖరి విడనాడి హామీల నిల బెట్టుకోవాలన్నారు. లేనిచో గత ప్రభుత్వానికి పట్టిన గతి భవిష్యత్‌లో ఈ ప్రభు త్వానికి పడుతుందని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ ఏవో జయసుధకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐపీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

7న పాలమూరులో మాదిగల ధర్మయుద్ధ మహాసభ

నవతెలంగాణ - గట్టు

పాలమూరులో 7న మాదిగల ధర్మయుద్ధ మహాసభ నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బలిగేర ఏసన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ బండారి తూమ్ డేవిడ్‌లు తెలిపారు. సోమవారం మండలంలోని బలిగెర గ్రామంలో గట్టు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ,ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ ఆధ్వర్యంలో బలిగెర గ్రామంలో ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ సుప్రీంకోర్టులో ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ సాధించి మొట్ట మొదటిసారిగా పాలమూరుగడ్డపై అడుగు పెట్ట బోతున్న సందర్భంగా ఆయనకు ఘనస్వాగతం పలకాలని కోరారు. ఎమ్మార్పీఎస్ 30 ఏళ్ల సుదీర్ఘ ఉద్యమ పోరా టాన్ని సుప్రీంకోర్టు గౌరవించి మాదిగ ఉపకులాల నిరుద్యోగులకు, ప్రజలకు అంతిమ తీర్పు వెలువడించిన సమ యంలో, తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి సుప్రీంకోర్టు తీర్పుని స్వాగతిస్తూ, తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిగా ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ ఫలాలు, విద్యా ఉద్యోగ రంగాలలో సముచిత స్థానం కల్పించి, అమలు పరుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చి, మొన్న జరిగిన డీఎస్సీ ఫలితాలలో మాదిగ ఉపకులాల నిరుద్యోగులకు మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనకు మాదిగల దెబ్బరుచి చూపించి, వర్గీకరణ ఫలాలు అందే విధంగా గట్టు మండలంలోని అన్ని గ్రామాల ఎమ్మార్పీఎస్ కమిటీ అధ్యక్షులు ఉపాధ్యక్షులు,



కమిటీ సభ్యులు పాల్గొని మాదిగల ధర్మయుద్ధ మహాసభ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బలిగేర గ్రామ కమిటి నాయకులు బలిగేర మాజీ సర్పంచ్ సామెల్, అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం గట్టు మండల కన్వీనర్ కురుమన్న ఇసాక్, దూబే, యేసు, గుళికి దావీదు, కొళాయి చెనయ్య ,మోజెస్, రవి, సిమోన్, గోరెపేగుల దానియేలు, భీమయ్య ముక్కరయ్య, సునంద్, వెంకటరత్నం, చెన్నయ్య, సత్యప్ప, దేవన్న, ఆదాము, ఏలియా, ముక్కరయ్య, రవి, ఇస్సాకు, రాజు, హనుమంతు, దానియేలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
జోగులాంబ - గద్వాల
మంగళవారం | నవంబర్ 05, 2024 | www.navatelangana.com

ఉపాధి అవకాశాలపై..
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- మాజీ జెడ్పీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జీ సరిత, మున్సిపల్ చైర్మన్ బీ.ఎస్. కేశవ్



నవతెలంగాణ - మల్దకల్

తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టి సారించిందని, ఈ క్రమంలో చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు, ప్రైవేటు పరిశ్రమలో ఉపాధి కల్పన కోసం ప్రత్యేకశిబిరాలను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు అవగాహన శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జీ సరిత, మున్సిపల్ చైర్మన్ బీ.ఎస్. కేశవ్ పేర్కొన్నారు.సోమవారం గద్వాల పట్టణంలోని అనంత కన్వెన్షన్ హాల్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యుడు మల్లు రవి ఆదేశాల మేరకు.. ఏర్పాటు చేసిన చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు ,ఉపాధి అవకాశాలపై అవగాహన, శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ ఉన్నత విద్య, సాంకేతిక విద్యలలో ఎంతో ప్రావీణ్యం ఉండి, సరైన ప్రోత్సాహం లేక వెనకబడ్డ నిరుద్యోగ యువతీ, యువకులకు స్వయం ఉపాధి, చిన్న మధ్యతర పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు పలువురు పారిశ్రామికవేత్తలు సంబంధిత బ్యాంకర్లు సానుకూలంగా ఉన్నారని, వారు కల్పించే ఈ అవకాశాన్ని యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గద్వాల నియోజకవర్గం నుంచి ఈ కార్యక్ర మానికి హాజరైన యువతీ, యువకులు గ్రామాల్లోని అందరికీ అవగాహన కల్పించాలని, తెలంగాణ చిన్న మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటులో గద్వాల నియోజకవర్గం ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ కో ఆర్డినేటర్ మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మహ్మద్ ఇసాక్, మధుసూదన్ బాబు, సీనియర్ సిటిజన్ మోహన్ రావు, ఖలీం, గోనుపాడు శ్రీనివాస్ గౌడ్, అల్వాల రాజశేఖరరెడ్డి, ఆనంద్ గౌడ్, డీ.ఆర్.శ్రీధర్, శ్రీనివాసులు, జనార్ధన్ రెడ్డి, మహేష్, రంజిత్, మధు, సురేష్, శెట్టి ఆత్మకూరు లక్ష్మణ్, నాగరాజు, ప్రజాప్రతినిధులు సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యువతీ, యువకులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీకి ఘన సన్మానం



నవతెలంగాణ - మల్దకల్

తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా రామ్మోహన్ శెట్టి ఎన్నిక కావడం పట్ల సోమవారం మాజీ చైర్పర్సన్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ సరిత తిరుపతయ్య, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ క్యాంపు కార్యాలయంలో ఆయన్ని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ సరిత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రైస్ మిల్ అసోసియేషన్ నుంచి రామ్మోహన్ శెట్టి ఎన్నిక కావడం గద్వాల్ నియోజకవర్గనికి గర్వకారణమని అన్నారు. మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే గద్వాలకు ఒక మంచి పేరు ఉందని , గద్వాల్ నియోజకవర్గంలో ఇలాంటి తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా రామ్మోహన్ రెడ్డికి ఈ పదవి రావడం గద్వాల నియోజకవర్గంలోనే ఒక అరుదైన పదవి దక్కిందని సంతోషిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ , మండల నాయకులు , ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి

- చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

బిజ్వారం గ్రామానికి చెందిన రాజేశ్వరి మృతికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని ప్రజా సంఘాల నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి మాట్లాడుతూ కేసు నమోదై 16 రోజులవుతున్న బండ్ల రాజశేఖర్ రెడ్డిని ఇంకా అరెస్టు చేయలేదని, ఆయన్ని అరెస్ట్ చేయడంతో పాటు రాజేశ్వరిని బెదిరింపులకు పాల్పడ్డ మల్దకల్ ఏ ఎస్ ఐ పై కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. రాజేశ్వరి తల్లి కవితకు ఆర్థిక సహాయం చేయాలని, కుటుంబంలో ఎవరికైనా ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, లేదా ప్రభుత్వం నుంచి 3 ఎకరాల భూమి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమం లో గద్వాల కార్యదర్శి రేవతి, నాగర్ దొడ్డి వెంకట్ రాములు, రైతు సంఘం గోపాల్ రైతాంగ సమితి నుంచి గోపాల్ యాదవ్, సిపిఎం వెంకట్ స్వామి, సిపిఐ నుండి ఆంజనేయులు, ప్రకాష్, చిట్టెం కృష్ణన్న, కురువపల్లె న్న, కే ఎస్ పి ఎస్ నుంచి రవికుమార్ ప్రేమ రాజు, బీఎస్పీ నుంచి మణికుమార్, ఉత్తనూరు వెంకన్న, గాజుల కృష్ణ, బిఆర్ఎస్ నాయకులు వీరేష్, రాజు వ్యవసాయక కార్మిక సంఘం, బహుజన సేన సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాల కళావేదన నిర్మాణానికి..
రూ. లక్ష యాభై వేల విరాళం



నవతెలంగాణ - గట్టు

మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో శిథిలావస్థలో ఉన్న కళావేదిక నిర్మాణానికి మాచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో చదివిన విద్యార్థి 1992 - 93 10వ తరగతి పూర్వ విద్యార్థి బలిగేర గ్రామానికి చెందిన మాలి పటేల్ పెద్ద హనుమంతురెడ్డి కుమారుడు సుధాకర్ సోమవారం లక్ష యాభై వేలను విరాళంగా పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. సింగపూర్ దేశంలో సినీరంగంలో పనిచేస్తున్నటువంటి ఆయన పాఠశాల ఆవరణంలోని శిథిల వ్యవస్థ ఉన్న కళావేదికను రూపురేఖలు మార్చడానికి తనవంతు సహాయం కింద అందజేసినట్లు తెలిపారు.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థి తను చదువుకున్న పాఠశాలకు ఎంతో కొంత సహాయం చేయాలన్న ఉద్దేశంతో ఇలాంటి వ్యక్తులు ముందుకు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. కనుక పాఠశాల సిబ్బంది, పాఠశాల విద్యార్థుల నుంచి ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు రఘు , పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు చేయాలని..
కలెక్టరేట్ ఎదుట ధర్నా



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

అలంపూర్ నియోజకవర్గం రాజోలి మండలం లోని పెద్ద ధన్వాడ గ్రామం దగ్గర నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీని తక్షణమే రద్దు చేయాలని ఆ మండల ప్రజలు పెద్ద ఎత్తున సోమ వారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు బీఆర్ఎస్వీ జోగులాంబ గద్వాల జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య సంఘీభావం తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కబలించే ఆ ఫ్యాక్టరీని ఇక్కడ నిర్మించడానికి వీలులేదని, పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

సత్వరమే దరఖాస్తులను పరిష్కరించాలి

- కలెక్టర్ బీ.ఎం.సంతోష్

నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ బీ.ఎం.సంతోష్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు సమర్పించిన దరఖాస్తులను జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగ రావు లతో కలిసి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణ ంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగాకృషి చేయాలనిఅధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుంచి మొత్తం 40 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ, రైతుబంధు..
అమలు చేయాలని కలెక్టర్‌కు వినతి

తెలంగాణలో భూములున్న కర్నూలు ప్రాంత రైతులకు రుణమాఫీ, రైతుబంధు అమలు చేయాలని కోరుతూ కర్నూలు మండలం ఇ -తాంద్రపాడు సర్పంచ్ బాలపీర ఆధ్వర్యంలో ఆ గ్రామానికి సంబంధించిన దాదాపు 40 మంది రైతులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్, రైతు సంఘం నాయకులు హుస్సేన్ మాట్లాడుతూ అలంపూరు, ఉండవల్లి మండలాల పరిధిలో కర్నూలు మండలంలోని వివిధ గ్రామాల రైతులకు వ్యవసాయ భూములు ఉన్నాయని, ఇక్కడే వ్యవసాయం సాగు చేసుకు ంటున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం గతంలో తెలంగాణలో వ్యవ సాయ భూములు ఉన్న కర్నూ లు ప్రాంత రైతులందరికీ రుణమాఫీ ఇచ్చిందని, రైతు బంధు అమలుచేసిందని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏ వీ అమలు చేయడం లేదని, ఇక్కడ పొలాలు ఉన్న రైతుల ందరికీ అలంపూర్ ,ఉండవల్లి బ్యాంకులలో పంట రుణాలు అందించారని , ప్రస్తుతం చాలామంది రైతులు పంట రుణాలు తీసుకున్నారన్నారు. రుణమాఫీ రాలేదని వ్యక్తి గత ంగా రైతు లందరూ అలంపూరు ఉండవల్లి మండలాల అధికారులకు దరఖాస్తులు ఇచ్చా రని, ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయలేదని పేర్కొన్నారు. కర్నూలు మండ లంలోని ఈ- తాంద్రపాడుతో పాటు పంచలింగాల, దేవమాడ, పూల తోట, పూడూరు గ్రామాలకు సంబంధించిన రైతులకు రుణమాఫీ అమలు కాలేదని అన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే తెలంగాణలో పొలాలు ఉన్న కర్నూలు ప్రాంత రైతులందరికీ రుణమాఫీ అమలు చేయాలని, రైతుబంధు చెల్లించాలని కోరారు.సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ. వెంకటస్వామి జిల్లా కమిటీ సభ్యులు దేవదాసు, ఉప్పేరు నరసింహులు వారికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు గొల్ల చంద్రుడు, మాబులాలు, చిన్న వెంకట స్వామి, ఖాజా , హుస్సేన్, పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.







మహిళల రక్షణే.. షీ టీమ్స్ ప్రధాన లక్ష్యం

- ఎస్పీ శ్రీనివాసరావు



నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

మహిళలు, యువతులు, బాలికలు ఆకతాయిల వల్ల గానీ, మరే విధమైన వేధింపులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లయితే నిర్భయంగా పోలీస్ షీ టీమ్స్‌ను సంప్రదించాలని ఎస్పీ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెలలో జిల్లాలో షీ టీం చేపట్టినా కార్యక్రమాలు, షీ టీమ్ పని తీరు, ప్రజలు షీ టీంను ఉపయోగించాల్సిన అంశాలపై వివరించారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కళాశాల, పాఠశాలల విద్యార్థినులు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌లకు గురైనా.. మహిళలు పని చేసే ప్రదేశాల వద్ద వేధింపులకు గురైనా.. బాలికలపై ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్ప డినా వెంటనే నిర్భయంగా షీ టీమ్ లేదా పోలీసులను ఆశ్రయిస్తే సత్వర న్యాయం చేకూరుస్తామని అన్నారు. షీ టీమ్స్ ద్వారా జిల్లా వ్యాప్తంగా అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా షీ టీమ్స్ అక్టోబర్ మాసంలో 58 హాట్స్పాట్స్ ను సందర్శించి నిఘా ఉంచడం జరిగిందనీ, వేధింపులకు సంబంధించి 07 ఫిర్యాదులు రాగా 05ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. 04 రెడ్ హ్యాండెడ్ కేసులు, 06పెట్టి కేసు లు నమోదు చేసినట్లు వెల్లడించారు. మహిళలు సామాజిక మాధ్యమాలైన ఫేస్బుక్, వాట్సాప్, ఇన్స్టాగ్రామ్ వినియోగంలో జాగ్రత్తలు వహించాలని, వాటిలో ఫొటోలు, వీడియోలు పోస్టుచేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. షీ టీమ్స్‌ను నేరుగా సంప్రదించలేని వారు 8712670312ఫోన్ నంబర్‌కు లేదా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచనున్నట్లు తెలిపారు. షీ టీమ్స్ ద్వారా జిల్లా వ్యాప్తంగా పబ్లిక్ ప్లేసెస్, రైల్వే స్టేషన్, డిగ్రీ కాలేజీలో, ఇంటర్ కాలేజీలో, స్కూల్స్‌లో మొత్తం 17 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అంతేకాకుండా కళా బృందాల ద్వారా షీ టీం అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చట్ట ప్రకారం..
ఫిర్యాదులను పరిష్కరించాలి : ఎస్పీ



నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ టి శ్రీనివాసరావు సోమవారం బాదితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా తక్షణ పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలని సంబంధిత స్టేషన్‌ల ఎస్ఐలు, సీఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచించారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా ఎస్పీ సూచించారు. ప్రజా సమస్యలపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నామని అన్నారు. భూ వివాదాలకు సంబందించి 2, భర్త వేదింపులకు సంబందించి 1, గొడవకు సంబంధించి 1, ఇథనాల్ కంపెనీ ఏర్పాటు వద్దని 1, ఇతర అంశాలకు సంబంధించి 2 పిర్యాదులు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను తొలగించిన దుండగులు



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఐ డీ ఎస్ ఎన్ టీ కాలనీలోని 10 శాతం భూమి ముందు నాటిన మొక్కలను తొలగించారు. వృక్ష సంపదను పెంచి కాలుష్య నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు వెచ్చించి ప్రతిష్టాత్మకంగా హరితహారం పథకాన్ని ప్రవేశపెట్టి నగర పట్టణ గ్రామాలలో విరివిగా మొక్కలు నాటుతున్నారు. ఇదే క్రమంలో సంబంధిత అధికారులు గద్వాలలో రోడ్డుకి ఇరువైపులా నిర్ణీత ప్రదేశంలో మొక్కలను నాటగా ఉద్దేశపూర్వకంగా కొందరు దుండగులు మొక్కలను తొలగించి అధికారులకు సవాల్ విసురుతున్నారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట ఈ సంఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి : బీఆర్ఎస్



నవతెలంగాణ - మల్దకల్

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్. ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్ , రాష్ట్ర మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎన్‌హెచ్‌పీఎస్ జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ అన్నారు. సోమవారం బాధిత కుటుంబసభ్యులను వారు పరామర్శించి మాట్లాడుతూ.. గద్వాల పట్టణంలో మైనర్ బాలికను ప్రముఖ సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్ రెడ్డి తన ఇంట్లో పనిలో పెట్టుకుని కొన్నిరోజుల తర్వాత ఆ బాలికపై అక్రమంగా దొంగతనం కేసు మోపడంతో, ఈ ఘటన మొత్తం గద్వాల పట్టణంలో జరగగా మల్దకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు, మైనర్ బాలికను ఇబ్బందులకు గురిచేసి వేధించడంతో అవమాన భారం తట్టుకోలేక పురుగుల మందు సేవించి, ఆత్మహ త్యాయత్నం చేసుకున్న వడ్డే రాజేశ్వరి మృతికి కారణమైన సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్ రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకొని నిందితుడిని కఠినంగా శిక్షించాలని అన్నారు. మల్దకల్ పోలీస్ స్టేషన్‌లో మైనర్ బాలికపై పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి, మైనర్ బాలిక కుటుంబాన్ని భయాందోళనకు గురిచేసి ప్రాణాలతో చెలగాటం ఆడుతూ నేరాలు చేసి తప్పించుకొని తిరుగుతున్న సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్ రెడ్డిని, మైనర్ బాలికను వేధించిన మల్దకల్ ఎస్సైని అదుపులోకి తీసుకోకుండా పోలీసు వ్యవస్థ నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తున్నారని అన్నారు. నిందితులు ఎన్ని నేరాలు చేస్తున్నా, రాజకీయ పలుకుబడితో పోలీసులను తమ చేతిలో పెట్టుకుని, పేద వర్గాలపై కేసులు నమోదు చేసి అన్యాయం చేస్తున్నారన్నారు. నిష్పక్షపాతంగా విచారణ జరిపి మైనర్ బాలిక చావుకు కారకులైన బండ్ల రాజశేఖర్ రెడ్డిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. అంతకుముందు మండలంలోని బిజ్వారం గ్రామంలో ఇటీవల అవమాన భారంతో పురుగుల మందు తాగి మృతి చెందిన మైనర్ బాలిక వడ్డెర రాజేశ్వరి కుటుంబాన్ని పరామర్శించడానికి విచ్చేసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్. ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్, రాష్ట్ర మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు వారికి మద్దతుగా నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగ రంజిత్ కుమార్‌లి మైనర్ బాలిక కుటుంబానికి న్యాయం చేయుటకై బిజ్వారం గ్రామానికి నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నాయకులు పెద్ద ఎత్తున ర్యాలీగా బయలుదేరి వడ్డేర రాజేశ్వరి కుటుంబాన్ని పరామర్శించి మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలు సుకున్నారు. ఈ కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, జిల్లా నాయకులు రంగస్వామి, వెంకట్రాములు, మల్దకల్, గట్టు, ధరూర్ మండలాల అధ్యక్షులు విష్ణు, బలరాం నాయుడు, గోవిందు, మండలఉపాధ్యక్షులు ప్రేమ్ రాజ్,నజుముల్లా, ఆంజనేయులు, నాయకులు అవనిశ్రీ, తిమ్మప్ప,సర్వేశ్, గోపాల్, మల్దకల్, నాగరాజు, భూపతి, లక్ష్మన్న,జమ్మన్న పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం..

బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తాలూక వాల్మీకి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మల్దకల్ మండలంలోని బిజ్వారం గ్రామంలో ఇటీవల అవమాన భారంతో పురుగుల మందు తాగి మృతి చెందిన మైనర్ బాలిక వడ్డెర రాజేశ్వరి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం నాయకులు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, వడ్డే రాజేశ్వరి మృతికి కారణమైన బండ్ల రాజశేఖర్ రెడ్డిని చట్టం పరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వడ్డే రాజేశ్వరి తల్లి కవితకు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి బోయ సంఘాల జేఏసీ కన్వీనర్ వైడింగ్ రాములు, గద్వాల వాల్మీకి సేవ సంఘం అధ్యక్షులు చిన్న పాడు ఆంజనేయులు, తాలూకా సేవా సంఘం కార్యదర్శి బీ. శంకర్, కార్యవర్గ సభ్యుడు ఎన్. వెంకట్రాములు , మెకానిక్ బిచ్వారం గోవిందు, బిజ్వారం వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.





బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ - మల్దకల్

మండలం నీలిపల్లి గ్రామంలో వెంకటేష్ గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మల్దకల్ 1997-98 బ్యాచ్ విద్యార్థి వెంకటేష్ గౌడ్ నీలిపల్లి గ్రామం అనారోగ్యంతో నాలుగు రోజుల క్రితం మృతి చెందాడు. తల్లి, భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారి ఆర్థిక పరిస్థితి బాగలేదని తెలుసుకోన్న వారి మిత్రులు 1997-98 పదవతరగతి మిత్రబృందం అందరూ కలిసి సోమవారం వెంకటేష్ గౌడ్ భార్య, పిల్లలకు మేము ఉన్నామని ధైర్యంగా ఉండాలని , మంచి మిత్రుడిని కోల్పోయామని భవిష్యత్తులో వారి కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. అనంతరం రూ. 25000/- ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బసవరాజు, నరసింహయ్య శెట్టి, రాఘవేందర్ గౌడ్, ప్రవీణ్ కుమార్ శెట్టి, కుమ్మరి శేఖర్, మహేశ్వరప్ప, ఉప్పరి తిమ్మప్ప, భీమరాయుడు, ఉప్పరిమల్దకల్,ఆంజనేయులు, శివారెడ్డి, ఉప్పరి మల్దకల్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ - గట్టు/ధరూర్ : కేటీదొడ్డి మండలం యర్సన్‌దొడ్డి గ్రామానికి చెందిన కురువ బుడ్డన్న విద్యుత్ షాక్ తో మృతి చెందాడు.బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకురాలు సరితమ్మ క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జీ సరిత, పట్టణ మున్సిపల్ చైర్మన్ బీ.ఎస్. కేశవ్‌లు రైతు బీమా, విద్యుత్ ప్రమాద బీమాకు సంబంధించి రూ. 5 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆనంద్ గౌడ్, యర్సన్‌దొడ్డి గోవింద్, నందిన్నె ఆంజనే యులు, పెద్దగురుస్వామి గౌడు, మహదేవ్, హరిజనఆంజనేయులు,రమేష్,శరణ బసవ పాల్గొన్నారు.